
# మిసిమి

మాస పత్రిక

జనవరి 1991 రు.2/-



# మిసిమి

*"All that we are is the product of what we have thought"*
*is "We are what we think."* - **Dammapada.**


సంపుటి 2 జనవరి 1991 సంచిక 18


విషయసూచిక


మేధావుల మెతకలు-1

— అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

ఏదో వుంది? ఏదో వుంది? — రావిపూడి వెంకటాద్రి

కులాలను ఆధారం చేసుకొనడం నికృష్టచర్య

రిజర్వేషన్లు ఉండాలి — మధులిమాయే

నేరము-శిక్ష అపరాధ పరిశోధకరాణి

అగతాక్రిష్టి శతజయంతి

మఠాధిపతులు — పాముగంటి లక్ష్మీనరసింహారావు



Printed, Published and Edited by Shri ALAPATI RAVINDRANATH for and at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, Ifiekar Mansion Lane, R.T.C. X Roads, Musheerabad, Hyderabad-500 020.

## STRUCTURE OF POWER IN UTTAR PRADESH

| Caste | 1952 MLAs | 1957 MLAs | 1980 MLAs and Lok Sabha MPs | 1983 Block Pramukha MLCs and Rajya Sabha MPs* |
|---|---|---|---|---|
| Brahmin | 27 | 21 | 22 | 20 |
| Thakur | 14 | 17 | 19 | 44 |
| Bania, Kayastha and Khatri | 15 | 14 | 5 | 3 |
| Jat, bhumihar and tyagi | 5 | 6 | 5 | 6 |
| Ahir, Kurmi, lodh and gujar | 6 | 10 | 13 | 16 |
| Other Backward Castes | 3 | 2 | 5 | 4 |
| Scheduled Castes | 20 | 21 | 20 | 2 |
| Muslims | 10 | 9 | 4 | 5 |
| **Total** | **100** | **100** | **100** | **100** |

Source: Dominance and State Power in India, Vol. 1; edited by Francine Frankel and M.S.A. Rao (OUP)

* Indirectly elected.

## CASTE BACKGROUND OF HINDU IAS OFFICERS

| State | Brahmin | Kshatriya | Shudra | Unidentified |
|---|---|---|---|---|
| Andhra Pradesh | 49.6 | 3.5 | 7.4 | 31.26 |
| Bihar | 29.5 | 11.4 | 1.1 | 22.2 |
| Gujarat | 36.4 | 7.7 | 1.6 | 28.8 |
| Jammu & Kashmir | 39.4 | 24.2 | – | 21.3 |
| Karnataka | 37.1 | 3.4 | 2.8 | 46.4 |
| Kerala | 44.7 | 2.9 | 4.9 | 37.9 |
| Madhya Pradesh | 37.6 | 11.4 | 0.7 | 23.1 |
| Maharshtra | 50.7 | 8.5 | 1.8 | 23.9 |
| Orissa | 54.1 | 3.1 | 1.3 | 26.2 |
| Punjab | 28.4 | 25.0 | 2.2 | 21.7 |
| Rajasthan | 30.8 | 13.9 | 0.05 | 24.95 |
| Tamil Nadu | 38.5 | 3.4 | 2.2 | 45.9 |
| Uttar Pradesh | 29.9 | 8.5 | 0.5 | 32.7 |
| West Bengal | 42.5 | 5.4 | 2.7 | 15.9 |

Source: Dominance and State Power in India, Vol. 1; edited by Francine Frankel and M.S.A. Rao (OUP)

All figures in per cent.

# మేధావుల మెతకలు-1

## కారల్ మార్క్స్

— అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

ఎవరు అవునన్నా ఎవరు కాదన్నా ప్రపంచంలో మూడోవంతు మందిని అత్యంతంగా ప్రభావితం చేసినవాడు కారల్ మార్క్స్. స్త్రీల పురుషుల మనస్సులను ఆకట్టుకొన్నాడు. ఇటీవల ఐరోపా చరిత్రకు మలుపు నివ్వడంలో శ్రీకారం చుట్టాడు. కొంతమంది అతడంటే ఎంత తీవ్ర ఉద్వేగంతో ఆకర్షితులయ్యారో, మరి కొంతమంది అంత తీవ్రంగాను వికర్షితులయ్యారు. ఈ ఆకర్షణ-వికర్షణలకు మూలం ఆయనలో ఎక్కడ వుంది? ఆయన భావ శబలతలో ఉందంటారు కొందరు. మరికొందరు ఆయన సిద్ధాంతాలను అత్యంత నిష్ఠుర నియంతృత్వంతో స్టాలిన్, మావోలు అమలు జరపడంలో ఉందంటారు. ప్రపంచంలో అతి పెద్దదేశాలైన చైనా, రష్యాలు, వాటి ఉపగ్రహ దేశాలు అమలు పరచడంలో ఉందంటారు.

ఏది ఏమైన దర్శక నిర్మాతలలో చివరివాడు, భౌతిక వాదానికి తిరిగి ఊపిరిపోసినవాడు, దానికి నూతన అర్థాన్ని కల్పించి చరిత్రలో కొత్తముడి వేసినవాడు మార్క్స్. హెగెల్ వారసుడు; హెగెల్ లా మానవ పరిణామ క్రమాన్ని ఒకే ఒక హేతుత్వ సూత్రంతో నిబద్ధించవచ్చునని నమ్మినవాడు.

ఎవరైనా తను పుట్టిన యుగలక్షణాలను పుణికి పుచ్చుకోవలసిందే. మార్క్స్ అంటే పందొమ్మిదవ శతాబ్ది మధ్యకాలపు లక్షణాల బిడ్డ అతడు. ఆ కాలాన్ని శాస్త్రం ఏలుతోంది. అందుకని అతడు, –తననూ, తన దర్శనాన్ని ఇతరులనుంచి, ఇతర దర్శనా ంచి వేరుగా చూపించుకోవడానికి, తాను శాస్త్రీయం, తనవాదం శాస్త్రీయం అని చెప్పుకొన్నాడు. నిజంగా అతడూ, అతడివాదం అంత శాస్త్రీయాలా! డార్విన్ పరిణామ వాదంలా, చరిత్రలో మానవ ప్రవర్తనకూ తాను ఒక శాస్త్రీయ వివరణ కనుకొన్నాననుకొన్నాడు ఆయన. ''ఏ ఇతర దర్శనం శాస్త్రీయం కాని విధంగా మార్క్స్ దర్శనం మాత్రమే శాస్త్రీయం'' – అనే అర్థంలో కమ్యూనిస్టుదేశాల పాఠశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో మార్క్సిజమ్ బాగా నాటబడింది; నింపబడింది. అది పొరిలి ఒలికిపోయి మార్క్సేతర ప్రపంచంలోని కొంతమంది మేధావులను తాకింది. అధికారంతో రంగరించి ఉగ్గుబాలు పట్టిన దేశాలు, మేధావులు మార్క్స్‌ని, మార్క్స్ దర్శనాన్ని శాస్త్రీయం అన్నారు.

మరి మార్క్స్ ఏ అర్థంలో శాస్త్రీయం? శాస్త్రం విషయాశ్రయం. అలాంటి జ్ఞానం కోసం వాస్తవ ప్రపంచాన్ని ఆశ్రయించాలి. మరి మార్క్స్ తన వాదాన్ని విషయాశ్రయం చేయడానికి వాస్తవ ప్రపంచాన్ని కేంద్రం చేసుకొన్నాడా? కేవలం అతడు గ్రంథాలయాలను,

నీతి పుస్తకాలను (Blue Books = అధికార గ్రంథాలు) మాత్రమే ఆధారం చేసుకొన్నాడు. ప్రవృత్తి రీత్యా గూడ అతడు పుస్తకాల పురుగే.

అసలతడి వారసత్వాన్ని చూసినా, అతడి మాతాపిరుల వంశాలు రెండూ పండితుల కోవకు చెందినవే. అతడు 5 మే 1818న పుట్టాడు. బాన్, బెర్లిన్ విశ్వవిద్యాలయాలలో చదివాడు. విజ్ఞాన సర్వస్వాల లాంటి బృహత్ గ్రంథాలు రాయాలని, అతడు గ్రంథాలయాలనుంచి విషయాలు సేకరించాడు. జెనా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టాన్ని తీసుకొన్నాడు.

ఒకసారి తాను ఇలా వాపోయాడు ''నేను పుస్తకాల పురుగుని అవ్వాలని శపింపబడ్డా కాబోలు!'' లోతుగా దిగిచూస్తే అతడంత పెద్ద పండితుడూ కాదు. ఆయన కోరుకొన్నట్లు శాస్త్రవేత్తాకాదు. సత్యాన్వేషణలో ఆయనకున్న ఆసక్తికంటె, దానిని ప్రకటించడంలో ఆయనకు ఎక్కువ ఆసక్తి ఉంది. అతనితో మూడు ''వార''లున్నాయి. ఒకటి అతడు కవి. రెండు పత్రికా విలేఖరి. మూడు నైతికవాది. అతడి కఠోరదీక్ష ఈ మూడింటితో కలిసి అతనిని ఒక మహారచయితగా ద్రష్టగా మలిచాయి. ఇందులో శాస్త్రీయత ఏమీ లేదు.

అతడు ప్రప్రథమంగా కవి: చాలా మందికి అసలు మార్క్స్ కవి అనే విషయం తెలియదు. అతడి కవితాదృష్టే అతడి సిద్ధాంత భాగానికి గూడ రంగు పులిమింది. అతడు చిన్నప్పుడే కవనం రాయడం మొదలు పెట్టాడు. రెండే రెండు విషయాలపై అతడు కవితలల్లాడు. ఒకటి ప్రేమ. రెండు ప్రళయం. ప్రేమ గీతాలన్నీ ప్రక్కింటి జెనీమీద రాశాడు. తరువాత ఆమెనే 1841లో వివాహమాడాడు. మూడు సంపుటాల ప్రేమకవితలు జెనీకి పంపితే, ఆ తరువాత అవి వారి కూతురు లారాకు వారసత్వంగా వచ్చాయి. 1911లో లారా మరణం తరువాత అవి ఏమైపోయాయో తెలియదు. గద్యరూపంలో ఉన్న ఒక విషాద రచనతో సహా నలభై పద్యాలు దొరికాయి. రెండు పద్యాలు 23 జనవరి 1841 అథెనియమ్ (Athenaeum) లో ప్రచురితమయ్యాయి. వాటి శీర్షిక ''అటవిక గీతాలు'' (Sauage Songs). అతడి గద్య రచనలు– ''మానవ భవితవ్యం'', నిరాశ, ద్వేషం, దౌర్జన్యం, లంచగొండితనం, ఆత్మహత్యా ఒడంబడికలు, దయ్యంతో సంధి– మొదలైన విషయాలపై కూర్చబడ్డాయి. ''మేము శృంఖలా బద్ధులం, విదీర్యులం, శూన్యగర్భులం, భయకంపితులం, ఈ అస్తిత్వ శిలకు శాశ్వత శృంఖలా బద్ధులం'' మంచుగుండె దేవుని అనురూపులం, మానవాళిపై మహాభిశాపాలను విసరుతాం''– అతడి గీతాలు ప్రతిబింబించే భావాలు ఇవి. అతడి గీతాల వెనుక ప్రపంచ సంకటస్థితి పాదుకుపోవడం మనకు కనిపిస్తుంది. ''జాతస్యమరణం ధ్రువం–ఉన్నదంతా నాశమై పోవడానికే''–ఫౌస్ట్‌నుంచి ఉటంకించే వాడు మార్క్స్. ఈ నేపథ్యం ఆధారంగా, ''ఉన్న వ్యవస్థను ప్రళయం మింగివేస్తుందనే'' అతడికి కలిగిన తీవ్ర దర్శనం ఆయన్ను జీవితాంతం వదిలిపెట్టలేదు. ఇదే విషయం అతడి ప్రళయ కవిత్వంలో ఉంది; 1848 విధాన ప్రకటన వెనుక ఉంది. కాపిటల్ లో పరాకాష్ఠ చేరుకొంది. అతడు

పత్రికా విలేఖరి. చిన్నచిన్న వ్యాసాలనైతే అతడు వ్రాయగలడు కాని, ఒక బృహత్ గ్రంథం రాయాలంటే అతనికి అలవిమాలిన పని. మరి ఆయన "కాపిటల్" అనే బృహత్ గ్రంథాన్ని రాశాడు గదా! అయితే అది ఏ రకమైన "వాస్తవికాకృతి" (real form) లేని రచన. వాస్తవానికి అది అనేక వ్యాసాల కూర్పు. కాని చిన్న చిన్న పదునైన వ్యాసాలను రాయడంలో అతడు చేయిదిరిగినవాడు. మరెవ్వరూ అలా రాయలేరు. "సమాజం ఒక కొనసకు వచ్చింది. ఇక మునిగి పోతుంది" –అనే విషయాన్ని కవి తాలోకంలో దర్శించాడు. ఇక అతడు అల్లే వార్తాకథలన్నింటినీ ఈ దర్శనానికి జోడించేవాడు. ఆ కారణాన ఆ వ్యాసాలన్నింటికి ఒక సమగ్రత, సమన్వయత, సంగతత్వం అబ్బాయి. లేకపోతే ఆ వ్యాసాలు దేనికది విడివిడిగా ఉండిపోయేవే.

అతడు న్యూయార్క్ డెయిలీ ట్రిబ్యూన్‌కు 500 వ్యాసాలు వ్రాశాడు. అందులో సుమారు 125 వ్యాసాలు ఎంగిల్స్ ఛాయారచయితగా (Ghost-writer) రాసినవి. అయితే అందులో వాదబలం మాత్రం మార్క్సుదే.

మార్క్స్ గొప్పదనం, అతడు సూత్రాలను, సూక్తులను తయారు చేయడంలో ఉంది. అయితే అతడి పేరుతో ప్రసిద్ధమైనవన్నీ అతడి సొంతాలు కావు. "శ్రామికులకు దేశం లేదు" (The workers have no country); "ప్రొలెటేరియన్స్‌కు ఊడేదేమీ లేదు వారి విశృంఖలాలు తప్ప" (The proletarians have nothing to lose but their chains)— అనే సూక్తులు మారట్ (Marat) వి. "మతం ప్రజల నల్లమందు (Religion is the opium of the people) అనే సూక్తి హైన్ (Heine) ది. ఎవరి సామర్థ్యాన్ని బట్టి వారి నుంచి, ఎవరి అవసరం మేర వారికి (From each according to his ability, to each according to his needs) అనే సూక్తి లూయీ బ్లాంక్‌ది. "సర్వదేశాల శ్రామికులారా ఏకంకండి" (Workers of all countries, Unite) - కారల్ షపర్ (Schapper) నుంచి, "ప్రొలిటేరియేట్ నియంతృత్వం" (the dictatorship of the proletariat) బ్లాంక్వి (Blanqui) నుంచి గ్రహించాడు. అంత మాత్రంచేత మార్క్స్‌కు సొంతసూక్తులు తయారించే శక్తి లేదనుకొంటే అది పెద్ద పొరపాటే. "ఇతర దేశాలు చేసిన దానిని జర్మనులు ఆలోచించారు". "మతం భ్రాంతి జనక సూర్యుడు. తన చుట్టూ తా తిరగడం ప్రారంభించే వరకు మనిషి ఆ సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తాడు". "బూర్జువా వివాహం భార్యల సముదాయం." "నేనేమీ కాదు, ప్రతిదీ నేనే కావాలి." (I am nothing and I must be every thing) "ఏ యుగంలోనైనా పెత్తనం చేసే భావాలు పాలకవర్గంనుంచి వచ్చినవే". –ఈ సూక్తులన్నీ మార్క్స్ తయారీయే. ఇతరుల సూక్తులను సందర్భోచితంగా వాడడమే కాదు. వాటిని సంయోగించడంలో గూడ మార్క్స్‌ని మించినవారు మరొకరు లేరు. మార్క్స్ రాసిన "మానిఫెస్టో"లోని చివరి మూడు వాక్యాల ప్రతిభను దాటి వ్రాసిన మరొకరు కానరాదు: "శ్రామికులకు పోయేదేమీ లేదు. వారి శృంఖలాలు తప్ప. వారు సాధించాల్సిన ప్రపంచం ఒకటి ఉంది. ప్రపంచ శ్రామికులారా! ఏకం కండి!

అతడు పండితుడు: మార్క్స్ సైద్ధాంతికుడిగానే ఉండిపోదలుచుకొన్నాడు. ఒక నూతన దార్శనిక సంప్రదాయాన్ని నెలకొల్పి, ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తాలనుకొన్నాడు. అది కేవలం సిద్ధాంతపరమైందేకాక ఆచరణాత్మకమైందిగా గూడ ఉండాలనుకొన్నాడు. అందుకే హెగెల్ అంటే ద్వేషం, రాగం -రెండూనూ. జర్మన్ భాషలో కాపిటల్ రెండవ కూర్పుకు ముందు మాటలో ఇలా అన్నాడు: నేను మహోతాత్త్వికుడైన హెగెల్ శిష్యుడను. కాపిటల్‌లో, 'విలువ సిద్ధాంతం' (Theor of Value) చర్చలో హెగెల్ పారిభాషిక పదాలతో ఆడుకొన్నాను.'' తన ''గతితార్కిక పద్ధతి'' హెగెల్ గతితార్కిక పద్ధతికి వ్యతిరేకమన్నాడు. హెగెల్ గతితర్కంలో ఆలోచనా ప్రక్రియ వాస్తవ ప్రపంచాన్ని సృష్టిస్తుంది. మరి నా దృష్టిలో భావసంబంధమైనదంతా, మానవుని బుర్రలో విపర్యాసం చెంది, అనూదితమైనప్పుడు భౌతికం తప్ప అన్యం కాదు. అందుకని హెగెల్ సిద్ధాంతంలో గతితర్కం తలక్రిందులుగా నడుస్తుందంటారు. ఈ మార్మిక స్తరాలలో అచ్ఛాదితమైన జ్ఞానాన్ని కనుక్కోవాలంటే, దానిని తలమీద కాక కాళ్ళమీద నిలబెట్టాలి. సైద్ధాంతికుడుగా మార్క్స్, హెగెల్ గతితర్కంలోని దారుణ తప్పిదాన్ని కనుక్కొని నూతన దర్శనాన్ని స్థాపించాడు. ఇది నిజంగా అన్ని దర్శనాలను త్రోసి రాజన్నది. కాని కొపకంట అతడు, హెగెల్ తర్కాన్ని ''మానవావగాహనకు''రాచబాటగానే అంగీకరించాడు. వాస్తవంలో అతడు దానికి జీవితాంతం బందీగానే మిగిలిపోయాడు.

''ప్రపంచానికి అర్థం చెప్పడం కాదు చేయవలసింది, దానిని మార్చడం'' అని చెప్పే మార్క్స్, వాస్తవ ప్రపంచంలోని అనుభవాలను స్వీకరించకుండా, విషయాల కోసం గ్రంథాలయాలను శరణువేడాడు. దశాబ్దాలకు దశాబ్దాలు గ్రంథాలయాల్లో గడిపాడు. కాని బయటికి వెళ్ళి ప్రపంచాన్ని చూడలేదు. అతడు తన 24వ యేట, ''అడవి నుంచి స్థానిక రైతులు కొయ్యకొట్టుకొచ్చుకొనే హక్కు'' పై వ్యాసం వ్రాస్తూ, కనీసం వారితో మాటాడలేదు. 1844లో ''నేతపని వారి కష్టాలు'' పై వ్యాసం వ్రాస్తూ వారిని విచారించలేదు. మార్క్స్ ఎక్కువగా ఆర్థిక విషయాలను గురించి పరిశ్రమలను గురించి వ్రాశాడు. ఈ విషయాలతో సంబంధం ఉన్న వారిని ఇద్దరినే అతడు ఎరుగు. ఒకరు అతడి అంకుల్ ఫిలిప్స్, ఇతడు ఫిలిప్స్ ఎలెక్ట్రిక్ కంపెనీ వ్యవస్థాపకుడు. రెండో అతడు ఎంగిల్స్. ఒకసారి దూదిమిల్లును చూచి వద్దాం రమ్మని మార్క్స్‌ని ఎంగిల్స్ ఆహ్వానిస్తే, అతడు వెళ్ళలేదు. మార్క్స్ ఎప్పుడూ, ఏ మిల్లూ, ఏ గనీ, ఏ పరిశ్రమా చూసి ఎరగడు. అతడు ఎరిగినదంతా గ్రంథాలయాలు. వ్రాతబల్లముందు కూర్చోవడం.

శ్రామికవర్గాలనుంచి పైకి వచ్చిన సోషలిస్టులంటే మార్క్స్‌కు అంత ఇష్టం ఉండేది కాదు. అతడు ఆదరించిన వారంతా మధ్యతరగతికి చెందిన మేధావులు. ఎందుకంటే శ్రామిక సోషలిస్టులకు ''ఆవిష్కృత విప్లవం'' (apocalyptic revolution) అంటే విశ్వాసం లేదు. మార్క్స్ కేమో అటువంటి విప్లవం అనివార్యం. అతడు బ్రసెల్స్‌లో జరిగిన కమ్యూనిస్టు లీగ్ మీటింగ్‌లో విలియమ్ వెయిట్‌లింగ్

(William weitling) పై విరుచుకు పడిన తీరుచూస్తే విషయం అర్థం అవుతుంది. వెయిట్ లింగ్ ఒక నిరుపేద అయిన రజక స్త్రీకి పుట్టిన అక్రమ సంతానం. తండ్రి ఎవరో తెలియదు. దర్జీపని నేర్చుకొని, కష్టపడి స్వయం విద్యతో, స్వయం కృషితో పైకివచ్చి, శ్రామిక నాయకుడయ్యాడు. అతడికి సిద్ధాంత జ్ఞానం లేదని మార్క్స్ ఆరోపణ. ''సైద్ధాంతిక జ్ఞానం లేకుండా ఆందోళన నడపడం తప్పు. ఇలాంటి వాటిని అనాగరక రష్యాలో మతిమాలిన యువకులు నడిపిన నడపవచ్చుగాక. కాని నాగరక జర్మనీలో మనం సిద్ధాంత జ్ఞానం లేకుండా ఏమీ సాధించలేం''.... అలా సిద్ధాంత ప్రాతిపదిక లేకుండా అశాస్త్రీయంగా విప్లవం నడిపితే, ఒక ప్రక్క పూనకం వచ్చిన గణాచారి (నాయకుడు) మరో ప్రక్క నోరు తెరుచుకొని, చెవులు రిక్కించి వినే గాడిదలు తప్ప ఏమీ ఉండదు.'' దానికి వెయిట్ లింగ్ సమాధానంగా, ''అధ్యయన మందిరాలలో ఉత్పత్తి అయిన సిద్ధాంతాలను నేర్చుకోవడానికై నేను పోషలిస్టును కాలేదు, వాస్తవంగా కష్టపడి పనిచేసే వారి తరపున మాట్లాడడం కోసం వచ్చాను. అందుకని నిజమైన శ్రామికుల బాధామయ ప్రపంచానికి దూరులైన కేవల సైద్ధాంతికులకు తల ఒగ్గలేను'', అన్నాడు. ఒక ప్రత్యక్షసాక్షి కథనం ప్రకారం, మార్క్స్ బల్లను గట్టిగా గుద్దాడు. లాంతరు ఊగి పోయింది. ఒక్క ఉదుటున లేచి, నిలబడి పెద్దగా అరిచాడు. ''అజ్ఞానం ఇంత వరకు ఎవరికీ మేలు చేయ లేదు.'' శ్రామికుల స్థితిగతులను మార్క్స్ స్వయంగా పరిశీలించనూ లేదు. అలా పరిశీలించి అనుభవం ఉన్న వాళ్ళు చెప్పింది ఎప్పుడూ అతడు ఆలకించను లేదు. అసలు అతడు అలా ఎందుకు చెయ్యాలి? అతడు చెయ్యవలసిందంతా తన సిద్ధాంతానికి అనుగుణమైన విషయాలను సేకరించడమే కదా! కారల్ జాస్పర్స్, మార్క్స్ పద్ధతిని ఇలా క్రోడీకరించాడు: ''అతడి శైలి పరిశోధనకుని శైలి కాదు.. అతడి సిద్ధాంతానికి వ్యాఘాతాలైన దృష్టాంతాలను అతడు ఉటంకించడు. తాను సత్యమని నమ్మిన దానిని బలపరిచే విషయాలనే గ్రహిస్తాడు. అతడి ధోరణి సమర్థనయేకాని పరిశోధనకాదు''. అతడి పాండితీ ప్రకర్షకు శిఖరాయమాణమైన 'కాపిటల్'ను గూడ ఈ వెలుగులో చూడవలసిందే. అది ఆర్థిక ప్రక్రియల స్వభావాన్ని పరిశీలించే రచనకాక, నైతిక దర్శనంలో అతడు చేసిన కసరత్తు మాత్రమే. కాపిటల్ రచనలో విషయాలన్నింటిని గుదిగుచ్చే ఒక దారం, ఒక కేంద్రక సిద్ధాంతం లేదు. అతడు దానిని మొదట, ''పెట్టుబడి'', ''భూమి-కూలి'', ''శ్రమ'', ''రాజ్యం'', ''వాణిజ్యం'', ''ప్రపంచ విపణి-సంకట పరిస్థితులు'', — అనే ఆరు సంపుటాల్లో వెలువరించాలని ఆలోచించాడు. కాని అది అతడి శక్తికి మించినపని. అతడు వాస్తవంగా పూర్తిచేసిన ప్రథమసంపుటం (గందరగోళం చేసి దానిని రెండు సంపుటాలన్నారు) లో ఒక తార్కిక నమూనా అంటూ లేదు. లూయీ అల్థుసర్ (Louis Althusser) అనే ఫ్రాన్స్ దార్శనికుడు. దాని నిర్మాణక్రమం చాల గందరగోళంగా ఉందని, పాఠకుడు దాని మొదటి భాగం వదలివేసి, రెండవభాగం - ప్రకరణం-4తో మొదలు పెట్టితీరాలన్నాడు. అంతెందుకు ఎంగిల్స్ చేసిన దాని సంక్షిప్తీకరణ, ఆ

సంపుట బలహీనతలను, రచనలోని పొస గని తనాన్ని (అసంగతత్వాన్ని) ఎత్తి చూపుతుంది. మార్క్స్ మరణానంతరం, ఎంగిల్స్, మార్క్స్ నోట్సుల 1500 పుట లనుంచి ఎత్తి రెండువసంపుటం వేశాడు. ఇందులో నాలుగోవంతు ఎంగిల్స్ రచన. మూడవ సంపుటాన్ని గూడ ఎంగిల్స్ ఎత్తివ్రాశాడు.

1880లో, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాల యంలో పరిశోధకులు, మార్క్స్ ఎలా మూల గ్రంథాలనుంచి ఉటంకించేట ప్పుడు, తనకు అనుకూలంగా, కొన్ని వాక్యాలను సవరించి, మరికొన్నింటిని వద లివేసేవాడని, సోదాహరణంగా ఎత్తి చూపారు.

మార్క్స్ పైకి పండితుడే అయినా, సత్యసంశోధకుడు కాదు. మరి అలాంట ప్పుడు అతడిని నడిపిన శక్తి ఏది? దీనికి సమాధానం అతడి మూర్తిమత్వ శీలలక్షణా లలో లభిస్తుంది. అతడి కావ్యదృష్టి, పత్రికా లేఖనం, పాండిత్యాల సమ్మేళనం అతడి దర్శనం అని చెప్పుకొన్నాము. కాని అతడి రచనలలోని వాస్తవ విషయాలు అతడి మూర్తిత్వపు నాలుగు పక్షాలను ప్రదర్శి స్తాయి: 1. హింసాభిరుచి, 2. అధికార దాహం. 3. పొదుపరితనం లేక పోవడం, 4. తనచుట్టూ ఉన్నవారిని దోపిడి చేయడం (అంటే వారిపై బదనిక కావడం).

హింస మార్క్సిజంలో అంతర్వాహి నిగా ఉండనే ఉంది. మార్క్సిస్టు ప్రభు త్వాల ప్రవర్తనలో అది తేటతెల్లమైంది. మార్క్స్ పోటి దురుసువాడు. అందరితో తగవులే. కుటుంబంతోనూ తగవులే.

బాన్ విశ్వవిద్యాలయంలోనూ, ఇతడివద్ద పిస్టల్ ఉన్నందుకు అరెస్టు చేశారు. ఒకసారి ద్వంద్వయుద్ధం చేస్తే ఎడమకంటిమీద గాటు పడింది. తనతో సంబంధం ఉన్న అందరి తోనూ, వారు లొంగిపోతేతప్ప, తగవులే. బ్రూనో బావర్‌తో సహా తగవుపడ్డాడు. బావర్ సోదరుడు మార్క్స్‌మీద ఒక పద్యం అల్లాడు: ''ట్రైర్‌వాసి, నల్లనివాడు, బహు రోషకాడు, క్రోధఘూర్ణితుడు, దుష్టబద్ధ ముష్టివాడు, పర్జన్యగర్జానుకారి, వేయిద య్యాలు జుట్టు పీకినవాడు.'' అనెన్‌కోవ్ అతడిని మూర్తీభవించిన ప్రజాస్వామ్య నియంత (1846) అన్నాడు.

అతడి చిటపటలకు, అహంభావత్వా నికి మూలాలు అతడి శారీరక మానసిక మూలకాలలో ఉన్నాయి. అతడి జీవితం అనారోగ్యమయం. వ్యాయామం లేదు. మసాలా ఎక్కువగా తినేవాడు. విపరీతంగా త్రాగేవాడు. పొగత్రాగేవాడు. ఫలితంగా అతడి లివరు అతడితో సహకరించలేదు.

డబ్బును ఎలా ఖర్చు పెట్టాలో అతడికి చేతకాదు. బహుశా ఆ చేతకానితనం పెట్టు బడిదారీ వ్యవస్థపై ఉన్న ద్వేషానికి మూలం కావచ్చు. మార్క్స్‌కు డబ్బుచిక్కులు అతడి యూనివర్సిటి దశనుంచి జీవి తాంతం పీడించాయి. అప్పులు చేశాడు. వడ్డీతో తీర్చాల్సి వచ్చేటప్పటికి చిరట్లు బురట్లు. వడ్డీని ''మానవాళిపై మహా నేరం''గా పరిగణించాడు. దానిని మనిషిని మనిషి దోచుకోవడం అన్నాడు. పాపం ఆయన భార్య జెనీకి బడ్జెటు ప్రకారం ఖర్చు చేయడం తెలియదు. ఇంటిలో విలువైన వస్తువులన్నీ కుదవకు పోయేవి.

1840లో మొదటిసారిగా మార్క్స్‌ను కలిసినప్పటినుంచి ఎంగిల్స్ డబ్బు అవసర మైనప్పుడెల్లా సర్దుబాటు చేసేవాడు. ఎంగిల్స్ తనకొచ్చేదాంట్లో సగం ఇచ్చే వాడు. ఈ ఇద్దరి స్నేహంలో, ఎంగిల్స్ సహాయం పొందుతూగూడ, మార్క్స్ ఎంగిల్స్‌పై పెత్తనం చెలాయించేవాడు.

కుటుంబ జీవితమూ సుఖకరంగా సాగ లేదు. 1848 నుంచి పదిసంవత్సరాల పాటు జెనీ జీవితం ఒక పీడకలగానే గడిచింది. మార్చి 3, 1848న అతడిని జైలులో పెట్టారు. ఆమెనూ కొంతమంది వేశ్యల తోపాటు ఒక గదిలోఉంచారు. 1849 జూన్ నాటికి అతడు ఏమీలేని వాడ య్యాడు. తరవాత నెలలో ఒక స్నేహితు నికి వ్రాసిన ఉత్తరంలో, ''నా భార్య నగలలో చివరిదిగూడ కుదువ దుకాణాన్ని వెదు క్కొంటూ పోయింది'' అని వ్రాశాడు. వారప్పుడు ఇంగ్లాండ్ లో ఉన్నారు. అప్పు డామె గర్భిణి, అప్పటికే ముగ్గురుపిల్లలు జెనీ, లారా, ఎడ్గార్‌లు. 1849 నవంబ రులో నాలుగో సంతానం. ఐదు నెలల తరువాత అద్దెకట్టకపోతే, సామాన్లు రోడ్డు మీదకు విసరివేసి, బయటకు గెంటివే శారు. వారి మంచాలు, కంచాలు అమ్మి పాలవానికి, సరకుల కొట్టుకు కట్టవలసి వచ్చింది. దీనితో ఆమె మార్క్స్‌ను పూర్వవాత్సల్యంతో ప్రేమతో చూడలేక పోయింది.

ప్రష్యన్ గూఢచారి 24మే 1850న పంపిన రిపోర్టు చూస్తే జెనీ కష్టాలు తెలు స్తాయి. ''త్రాగుతాడు. ఉతికిన బట్టలు వేసుకొని ఎంతకాలమైందో. రాత్రింబవళ్ళు అలుపు సలుపు లేకుండా పనిచేస్తాడు. నిద్రకు వేళాపాళా లేదు. పగలే నిద్రపో తాడు. తెల్లవార్లు మేల్కొని ఉంటాడు. ప్రతిదీ విరిగిపోయిన పగిలిన వస్తువులే. అన్నీ మట్టిగొట్టుకు పోయినవే. అన్నీ చిందరవందర. గది మధ్యలో విరిగిని, చిరి గిన, నూనె మరకల సోఫా. దానినిండా పుస్తకాలు, కాగితాలు, వార్తాపత్రికలు, చాకులు, సిరాబుడ్డి, పొగాకుమసి. మూడు కాళ్ళ కుర్చీ ఒకచోట. మరోకుర్చీ (నాలు గుకాళ్ళది) పిల్లలు వంట ఆట ఆడుకొం టున్నారు. దీనిమీదే ఎవరైన అతిథులు వచ్చినప్పుడు కూర్చునేది.''

1851లో ప్రాంజస్కా పుట్టింది. మరు సటి సంవత్సరం చనిపోయింది. బాగా ముద్దుచేసిన అతని కొడుకు మాస్కో (చిన్నారి ఈగ) 1855లో గాస్ట్రో ఎన్ట్రైయి టిస్‌తో మరణించాడు. ఇది ఆ దంపతు లకు పెద్దదెబ్బ. దీనినుంచి జెనీ బయట పడలేకపోయింది. మార్క్స్ రాశాడు. ''చచ్చిపోతే బాగుండును'' - అని నాభార్య అంటోంది. 1860లో పెద్దమ్మారు పోయ డంతో ఆమెకున్న అందం కాస్తా హరించు కుపోయింది. 1881లో ఆమె అంతిమశ్వాస తీసి, చివరకు వరకు మార్క్స్ జీవితంలో నేపథ్యానికి వెళ్ళిపోయింది.

మార్క్స్ తనచుట్టూ చేరిన వారినంద రిని దోపిడికి గురిచేశాడు. ఎంగిల్స్‌ను సరేసరి. ఆయన తన కూతుళ్ళను వదలి పెట్టలేదు. వృత్తులు చేపట్టడానికి అనువుగా వారికి ఏ రకమైన విద్యాబుద్ధులు గరిపించ లేదు. విప్లవకారుడి కూతుళ్ళు ఇలా కాదు ఉండవలసింది. పియానో వాయించడం, చిత్రలేఖనం - ఇవి వ్యాపారస్తుల బిడ్డలు చేయవలసిన పనులు - నేర్చుకొన్నారు.

విప్లవవర్గం నుంచి వచ్చిన వరులను ఆయన తిరస్కరించాడు. అయితే వారితో తన కూతుళ్ళ వివాహాలను ఆపలేదు, ఆపలేకపోయాడు. లారాభర్త పాల్ లాఫ్రాగ్ ని (ఇతడిలో నీగ్రో రక్తపుజీర ఉంది) "నీగ్రిలో" అని, "గొరిల్లా" అని ఎద్దేవగా అనేవాడు. జెనీని చేసుకొన్న చార్లెస్ లాంగ్వెట్‌నూ అతడు ఇష్టపడలేదు. ఇద్దరు అల్లుళ్ళను "మూర్ఖులు" అన్నాడు. 1882లో అతడు మరణించాడు. అంతకు కొద్ది వారాల ముందు జెనీ చనిపోయింది. ఎలినార్, భర్తప్రవర్తనతో విసిగి 1898లో నల్ల మందు తిని ఆత్మహత్య చేసుకొంది. తరవాత 13 సంవత్సరాలకు లారా, ఆమెభర్త లాఫ్రాగ్‌లు ఆత్మహత్య ఒడంబడిక చేసుకొని, దానిని ఇద్దరూ అమలు జరిపారు.

అతడు దోపిడికి గురి కావించిన మరో వ్యక్తి వారి పనిమనిషి. ఈమె పేరు హెలెన్ డీమత్. అయితే ఆమెను "లెంచెన్" అనేవారు. 1823లో పుట్టిన ఈమె జెనీ తల్లిగారింటిలో దాసీగా చేరింది. తరవాత జెనీ మార్క్స్ సంసారంలో, జెనీకష్టాలను చూసి, ఆమెతల్లి 1845లో లెంచెన్‌ను బహూకరించింది. అప్పటినుంచి ఆమె జీవితాంతం మార్క్స్ కుటుంబంతోనే ఉండిపోయింది. 1849-51లో ఆమె మార్క్స్‌కు ఉంపుడుగత్తెగా మారి ఒకబిడ్డను కన్నది. మార్క్స్ ఏనాడు ఆమెకు జీతమిచ్చి ఎరుగడు. అయినా ఆమె వారిని వదలలేదు. మార్క్స్-లెంచెన్ల వ్యవహారం పసిగట్టిన జెనీకి మార్క్స్‌మీద ఉన్న ఆ కొద్దిప్రేమ కొడిగట్టింది. "మా కష్టాలు మేమూకాక, పైగా ఇదొకటి" అని జెనీ స్వీయచరిత్రలో వ్రాసుకొంది. 1851 జూన్ 23న, 28 డేన్‌స్ట్రీట్‌లో లెంచెన్ బిడ్డను ప్రసవించింది. జనన మరణాల రిజిష్టరులో ఆ బిడ్డను హెన్రీ ఫెడరిక్ డీమత్ గ నమోదు చేశారు. కాని, మార్క్స్ ఇదంతా ఒట్టి పుకారేనని కొట్టివేశాడు. గొంతుపుట్టకురుపుతో ఎంగిల్స్ 5 ఆగష్టు 1895న చనిపోయాడు. మాటాడలేని ఆరోజుల్లో ఎంగిల్స్ "ఫ్రెడీ మార్క్స్ కొడుకు" అని పలకమీద వ్రాసి ఎలినార్‌కు చూపించాడు.

వ్యక్తిగతంగా ఏ బలహీనతలున్నా, ఏమి చేసినా, అవి ప్రపంచంమీద అతడికి ఉన్న ప్రభావాన్ని ఏ మాత్రం తగ్గించలేకపోయాయి. ప్రపంచమానవాళి ఆశలకు ఊపిరి పోసినవాని వ్యక్తిగత బలహీనతలను ప్రపంచం క్షమిస్తుంది.

తత్వం సామాజిక రోగం. విప్లవం దీనికి చరమగీతం పాడుతుంది. అప్పుడు సమాజం ఆరోగ్యకరమైన పునాదులపై నిలబడుతుంది. ఇది తప్పకుండా జరిగితీరుతుందని మార్క్స్ విశ్వసించాడు. ఎలాగంటే విప్లవం, తత్వాన్ని యథార్థం చేస్తుందనీ, రోగగ్రస్త సమాజంలో దార్శనికులు తమను ఓదార్చుకొన్న హేతుత్వం, న్యాయం, స్వేచ్ఛలనే శూన్యాకృతులను విప్లవం యథార్థీకరిస్తుందని యువ మార్క్స్ విశ్వసించాడు. మార్క్స్ పెద్దవాడైన తరవాత, "విప్లవం మనుష్యులను వాస్తవప్రపంచమును చూడగలుగు రీతిగా కళ్ళు తెరిపించడం ద్వారా" తత్వాన్ని నాశనం చేస్తుందనీ" నమ్మాడు. కాని తత్వం తత్వంగానే మిగిలిపోయింది.

# ఏదో వుంది? ఏదో వుంది?

– రావిపూడి వెంకటాద్రి

శీర్షికలో తప్ప, వ్యాసంలోపల ఎక్కడా వెంకటాద్రి పేరు ప్రస్తావనకు రాని ''శ్రీ వెంకటాద్రి వ్యాసం చదివాక'' (మిసిమి, డిసెంబర్ 90) చూచాను. శ్రీ అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి నా వ్యాసం ''మానవ వాదం – శాస్త్రీయ దృక్పథం'' (మిసిమి, డిసెంబర్ 90) చదివాక ఉత్తేజం పొంది తన వ్యాసం ద్వారా దానికి మరికొంత వివరణ యివ్వాలనుకున్నారో, లేక అందులోని దోషాలను సవరణ చేయాలనుకున్నారో నాకు బోధపడలేదు. ఎందుకంటే ఆయన వ్యాఖ్యల్లో బారుకీ బ్రహ్మదండి ముళ్లు తగిలాయి.

నా పద్ధతి ప్రకారం నేను ''మానవవాదం –శాస్త్రీయ దృక్పథం'' గురించి పిసుగుడు లేకుండా నాల్గు మాటలు చెప్పడానికి ప్రయత్నించాను. వెంకటేశ్వర రెడ్డి గారికి అది **'ఒట్టి మానవవాదంగా'**, **'జంతు –మానవతనాన్ని'** కోరేదిగా అర్థమైందేమో ననిపిస్తున్నది. మానవవాదం వేరు, మానవతావాదం వేరు అని నేను వ్రాస్తే, వారు అవి రెండూ ఒక్కటేనని చెప్పబోయి మానవాదాన్నే ఒట్టిదిగా, గట్టిదిగా విభజించివేశారు.

అన్నపరెడ్డిగారి గట్టి మానవవాదమేమిటా అని చూస్తే, **'ఎవరూ దేనిలోకి తర్జుమా చేయలేని' 'దేనిలోకి మార్చలేని', 'దేనిలోనూ వివరించలేని', 'అనన్యమైన', 'సారమైన' 'పరమసత్యం' 'ఏదో'** ఒకటి మానవ స్వభావంలో **'వుందనీ'; 'మరో దానిలోకి మార్చవీలులేని', 'విశ్వేతర విలువలలోకి అపరివర్తనీయమైన' 'పారమార్థిక విలువలను'** సాధించాలనీ; అది **'మనిషి–మానవతనాన్ని'** కోరే గట్టి మానవతా వాదమనీ చెప్పుకొచ్చారు. ఇలాంటి పులుముడు పూర్వం బ్రహ్మవాదులూ చేశారు. దేనికో ఒకదానికి బ్రహ్మం అని పేరు పెట్టుకొన్నారు. అదేమిటో ఎవ్వరూ, ఎక్కడా వివరించలేదు. అది అదృష్టం, అవ్యవహార్యం, అగ్రాహ్యం, అలక్ష్యం, అచింత్యం, అవ్యపదేశ్యం, అద్వైతం అంటూ తమ అజీర్ణ వ్యాధిని బయటపెట్టుకున్నారు. అన్నపరెడ్డివారు తమ దానికి పేరయినా పెట్టకుండా **'ఏదో వుంది' 'ఏదోవుంది'** అంటున్నారు కాని, అదేమిటో, ఎలావుంటుందో చెప్పడం లేదు, చెప్పలేమని కూడా ఒప్పేసుకున్నారు. కాని, ఎవరో చెప్పలేని దాన్ని గురించి ఆయన ఏదో చెపుతూనే వున్నారు. అదే వారి మానవ –మానవతావాదం పురఫ్ మానవవాదం. అలాంటి సందిగ్ధత మానవ వాదంలో వుండదు, వుండరాదు అని చెప్పే ప్రయత్నమే నేను నా సెప్టెంబరు వ్యాసంలో చేశాను.

చెప్పేవాడికీ, వినేవాడికీ, ఇద్దరికీ అర్థం కానిది మానవవాదం కాదు, బ్రహ్మవాదం.

అది అనిర్వచనీయ బ్రహ్మవాదం. వివరణ సాధ్యంకాని మానవ స్వభావాన్ని బట్టి (వెంకటేశ్వరరెడ్డి గారి ప్రకారం) యేర్పడే మానవ-మానవతావాదం వివరణకు ఎదురు తిరుగుతుంది కాబట్టి, అది వినేవారికి (చదివేవారికి కూడా) అర్థమయ్యే పని లేదు. అంటే, వారిది పేరుకు మానవ -మానవతావాదమే కాని, అసలుకు అది నిర్వచనీయం 'ఏదోవుంది వాదం'. ఈ ఏదోవుంది వాళ్లు మానవవాదుల్లో లేరు. మానవ వాదులు 'ఇది వుంది' అంటారు. అది ఎలా వుందో కనుగొంటారు. ఈరోజు కాకపోతే రేపు, రేపుకాకపోతే మరోరోజు కనుగోగలమంటారు. కనుగోలేమని అనరు. అజ్ఞేయత అనేది మానవవాద భాషలో ఇమడదు.

అంతేకాదు-మానవవాదం మానవతను మనిషినుంచి వేరు చేసి చూడదు. అది మానవతా (Humane) లక్షణాలైన దయా దాక్షిణ్య కారుణ్యాదుల్ని కలుపుకొని విస్తృతమవుతుందని నేను నా వ్యాసంలో తొలుతనే ఉటంకించాను. ఆ లక్షణాలు వున్నట్లు కనపడి, వాస్తవికతను మరచి, సంప్రదాయానికి బానిసలై, చీమలకు పంచదార -పాములకు పాలు-మనుషులకు విషమూ నివేదించే హ్యూమన్ రాబట్స్‌ని, Estranged Parrots ని సమ్యక్ దృష్టికల మానవ వాదులనుంచి వేరుచేయడానికి (నవ్య) మానవవాదులు అలా అంటున్నారు. మానవతా వాదులుగా పైకి కన్పించిన ప్రవక్తలందరిలోనూ ఈ సమ్యక్ దృష్టిలోపాన్ని మనం గమనించవచ్చు. కొత్త ప్రపంచాన్ని వికృతంగా, భయంకరంగా చిత్రించి, పాత ప్రపంచ వూబినుంచి పైకిలేవకుండా మనుషుల్ని తొక్కిపట్టి వుంచే మనస్తత్వాన్ని పోషించడం కోసం అల్డస్ హక్స్‌లీలు, ఆర్థర్ సోస్లర్లూ ఏమైనా వ్రాయవచ్చు. వారి ప్రభావానికి లోనైన మిశ్రమ జాతివారు ఉపనిషద్వాదాన్ని కొత్త సీసాల్లోకి ఎక్కించి మతపునరుజ్జీవనానికి పూనుకోవడం ఈనాడు ఈ దేశంలో రహస్యమేమీ కాదు. చిత్రమేమిటంటే, మనిషికి ద్రోహం చేసే వారే మానవతగురించి తెగ మాట్లాడుతున్నారు. ఒక కోణంలో చెడును బూచిగా చూపి, మరో కోణంలో అజ్ఞానంలో చెడులో మ్రగ్గేటట్లు మానసిక వాతావరణాన్ని వ్యాప్తిచేస్తున్నారు. ఆ వైఖరిని మానవవాదం తిరస్కరిస్తుంది. మంచి చెడ్డలను అన్నికోణాలనుంచి చూచి, చెడును విసర్జించి, మంచిని స్వీకరించమని కోరుతుంది. అందుకు శాస్త్ర ప్రతిపత్తిద్వారా భౌతిక వాస్తవిక వాదాన్ని ఆలంబనంగా చేసుకొంటుంది.

హేతువాదం గురించి వెంకటేశ్వరరెడ్డి గారు చేసిన వ్యాఖ్యలు మరింత పేలవంగా వున్నాయి. హేతువాదం యొక్క నిర్ణాయక శక్తిని శంకిస్తూ ఆయన ఒక కట్టుకథను ఎదురొడ్డారు.

"ఏటికావల రోగశయ్యపై ఉన్న తన తండ్రికి ఉపచరించడానికి ఒక లేడీ డాక్టరు ప్రయాణమై, ఏరుదాటడానికి పడవవానిని పిలిచింది. అతడు ఆమెను తనకోర్కె తీరిస్తేకాని అవతలిగట్టుకు చేర్చనన్నాడు. అప్పుడామె ఏమి చెయ్యాలి? అతడి కోర్కె తీర్చాలా? తండ్రిసేవ మానాలా? అది గీటురాయి. హేతువాదం గీటురాయి కాలేదు."

ఏమి ధర్మ సంశయమండీ ఇది!

పడవవాని కోర్కె తీర్చి, అవతలిగట్టుకు చేరి, తండ్రిసేవ చేయమని లేడీడాక్టరు హేతువాదం లేడీ డాక్టరుకు చెపుతుందనుకుందాం – అప్పుడు వెంకటేశ్వరరెడ్డి గారేమంటారు? అయ్యో పాపమంటారా? అంతేకాదు, ఇక్కడ అనేక ప్రత్యామ్నాయాలకు అవకాశం వుంది. లేడీ డాక్టరే అతన్ని కోరి, కోర్కె తీర్చుకొని, త్వరగా అవతలిగట్టుకు చేరే అవకాశం వుంది. లేక, లేడీ డాక్టరు ఇష్టానికి వ్యతిరేకంగా పడవవాడు రేప్‌కు తలపడవచ్చు. రేప్ విషయం బయటకు పొక్కుతుందనే భయంతో ఆమెను హత్యచేసి ఏట్లో పారవేయవచ్చు. పడవవాడు అలాంటి కోర్కె కోరకుండా తన విధిని మామూలుగా నెరవేర్చవచ్చు. కోరినా, ఆమె విజ్ఞప్తి మేరకు కోర్కెను వుపసంహరించుకొని ఆమెను ఏరు దాటించవచ్చు. పడవ నట్టేట్లో మునిగి ఆమె మరణించవచ్చు, వాడు ఈదుకొని ఒడ్డు చేరవచ్చు. పడవవాడు ఇలాంటి కోర్కె కోరతాడనే అనుమానంతో ఆమె ముందుగానే మరో మార్గం చూచుకోవచ్చు. ఏ అడ్డంకులూ లేకుండా ఆమె తీరా ఆ దరికి చేరే సరికి తండ్రి మరణించవచ్చు. ఇందులో ఏదైనా జరగనూవచ్చు, జరగకపోనూవచ్చు. ఒక్కొక్క సంభావ్యతను **(Probability)** ఎదుర్కోడానికి ఒకే మార్గం కాదు, అనేక మార్గాలున్నాయి. వాటిని హేతుబుద్ధి చూపుతుంది. జీన్ పాల్ సార్త్రే ప్రకారమైతే ఆ సంఘటనలో ఇరుక్కున్న వారు తమ స్వేచ్ఛకొలది ఏదో ఒక మార్గాన్ని ఎన్నుకుంటారు. అందుకయినా హేతుబుద్ధి అవసరమే. ఈ మార్గాన్ని కాక ఆ మార్గాన్నే ఎందుకు ఎన్నుకోవాలో హేతుబుద్ధి చెపుతుంది. ఇంతకూ లేడీడాక్టరు సమస్యకు వెంకటేశ్వరరెడ్డి గారి అమలిన పరిష్కారమేమిటో! హేతువాదంలో ఎక్కడ బొక్కదొరుకుతుందా అని దేవులాడి, ఇలాంటి కట్టుకథల్ని అడ్డంతోస్తే ఎలా? పైగా, ''కొన్ని ముఖ్యమైన విలువలు ఘర్షించినపుడు అది (హేతువాదం) నిస్సహాయురాలు అవుతుంది'' అంటున్నారు. కాని, అప్పుడేది సహాయం చేస్తుందో చెప్పలేదు, కృతకవాదాలవల్ల కుశంకలవల్ల ప్రయోజనం ఏమి వుంటుంది?

హేతువాదం మత్స్యగంధీపరాశరీయానికి సంబంధించింది కాదు. నిత్యజీవితంలో ఏది ఎలా జరుగుతున్నదో తెలుసుకొని, అందులో దేన్ని ఎలా జరుపుకొన్నందువల్ల కీడు, దేన్ని విడిచి దేన్ని ఎలా జరుపుకొన్నందువల్ల మేలు కలుగుతాయో తెలుసుకొనే యోజనా విధానమే హేతువాదం కాని, అది అంతటితో ముడుచుకోదు. దాని చూపు దార్శనికత వైపు పరుగెడుతుంది. ప్రకృతి గురించీ, తనతోపాటు ప్రకృతిలో వున్న అవిభాజ్య భాగాలగురించీ, వాటి ఉనికి–పరిమితుల గురించీ మానవుడు అవిరతంగా ఆర్జిస్తున్న విజ్ఞానాన్ని సాధన సంపత్తిగా మలచుకొని మానవవాదం వైపు [illegible]గో గమిస్తుంది. విజ్ఞానం నిత్యపరిణామి కాబట్టి, హేతువాదమూ, మానవవాదమూ నిత్యపరిణాములే. అందువల్ల హేతువాదం కానీ, మానవవాదంకానీ వాదమూ కాదు, మతమూకాదు. మతవాదులకుండే విశ్వాసాలు **(Faiths)** మానవవాదుల కుండవు. మానవవాదుల నమ్మకాలన్నీ సమ్మతాల

(Convictions). ఇంగ్లీషులో Faith, Belief, Trust, Cofidence, Conviction అనే పదాలన్నింటికీ నమ్మకం అనో, విశ్వాసం అనో మనం తెలుగు చేసుకుంటాం, హేతువాదులకు, మానవవాదులకు వేటిమీదనైనా నమ్మకం కుదిరితే, అది సమ్మతం (Conviction) ఫలితమని అర్థం చేసుకోవాలి. అంతేకాని, అది మతనమ్మకం వంటి తిరుగులేని నమ్మకం కాదు.

మతమంటే విశ్వాసం, కాబట్టి, మానవవాదులు విశ్వాన్ని విశ్వసిస్తారు కాబట్టి, మానవవాదం కూడా మతమేనని వెంకటేశ్వరరెడ్డిగారి తర్కం. విశ్వాన్ని విశ్వసించడమేమిటి? It is just nonsense. విశ్వం వాస్తవం. It is given It is a fact. నేను చీరాలలో వుంటూ 'ఇది చీరాల అని నేను విశ్వసిస్తున్నాను. అని అంటే, నాకు భాష రాదనైనా అనుకోవాలి, లేక మతిచెడిందనైనా అనుకోవాలి. ఈ బల్లను నేను నమ్ముతున్నాను, ఈ కుర్చీని విశ్వసిస్తున్నాను అని ఎలాంటి వారంటారు. Facticityని నమ్మడమేమిటి? Absurd. విశ్వాన్ని మానసికమని నమ్మే మానవాదులున్నారని కూడా అంటున్నారు అన్నపరెడ్డి. అలాంటి వారు మానవవాదులు కారు. వారు భావవాదులు–పరోక్షమతవాదులు, కాగా మానవవాదం విశ్వాసమని చెప్పడం దానికి బురదపూసే ప్రయత్నమే.

శాస్త్రీయ విజ్ఞానం పెరిగే కొలది, దానితో సమన్వయమయ్యే హేతువాదమూ, తద్వారా మానవవాదమూ నిత్యపరిణామం చెందుతూ తమ పరిధిని ఎప్పటికప్పుడే విస్తృతం చేసుకుంటాయి. అందువల్ల అవి వ్యవస్థీకృతమయ్యే అవకాశం లేదు. వ్యవస్థీకృతం కానిదేదీ మతరూపు సంతరించుకోదు, మతానికి నయా నిర్వచనాలు చెప్పుకొంటూ, మతాన్ని. మానవవాద స్థాయికి పెంచడానికీ, మానవవాదాన్ని మతం స్థాయికి దించడానికీ జరిగే ప్రయత్నాలన్నీ ప్రచ్ఛన్న మతవాదుల కుట్రల్లో భాగాలే. ఆ పిసుగుడు వాదాన్ని హేతువాదం, మానవవాదం ఏ రూపంలోనూ ఆమోదించవు. దేశం లేకుండా మనసులేదు. మానసిక ప్రవృత్తి (Function) దైహిక ప్రవృత్తిలో భాగం. సంకల్పం (Will) కూడా ఆ ప్రవృత్తిలో భాగమే. ఇంకా పారమార్థికత ఎక్కడ? మురికి మాటలకు విజ్ఞాన శాస్త్రం రంగు పూయడం మార్మికవాదానికి మారురూపమే. విస్పష్టత లేని అభిప్రాయాలను విచక్షణా రహితంగా కలిపి, పిసికి ముద్దచేసి మనసుల్లో కుక్కడానికి చేసే ప్రయత్నంవల్ల మంచి జరగదు. క్రిటికల్ ఇంటెలిజెన్స్‌ని నిద్రపుచ్చడంవల్ల మానవతకే ప్రమాదం.

''ఏమి వుందో'' దాని రూపేణ లభించేది జ్ఞానం. అజ్ఞాన పరిమితిలో అవగతమయ్యేది సత్యం. సత్య పరిజ్ఞానం ద్వారా పొందగలిగేది స్వేచ్ఛ, సహేతుక స్వేచ్ఛావర్తనలో పెంపొందేది నైతిక ప్రవృత్తి (శీలం), ఇవి మానవ వాదంలో విలువలుగా పరిగణించబడతాయి. అవి కేంద్రంగానే ఉపవిలువలు పెంపొందుతాయి. మానవ విలువలకన్నింటికీ మానవుడే అంటే మానవుని శ్రేయస్సే కేంద్రం.

''ఏదో వుంది'', ''అది ఏమిటో ఎవ్వరూ ఎన్నడూ చెప్పజాలరు'' అనే

అజ్ఞేయ వైఖరి ద్వారా విలువలు ఏర్పడవు సరికదా, అలా బలవంతంగా ఏర్పరచుకొనేవి శుష్కవిలువలవతాయికాని, మానవ విలువలు కావు.

అందువల్ల అందరికీ విలువలుంటాయన్నంత మాత్రాన చాలదు. ఆ విలువల కేంద్రమేమిటి? అనేది ప్రశ్న. అది దైవమా? పరతత్వమా? ప్రవక్తా? మతమా? కులమా? జాతా? వర్గమా? మరొకటా? విలువలు మానవికాలని భావించే 'మానవవాదం' మానవుణ్ణి విభజించి, ఒకరి పరంగా ఒక విలువను, మరొకరి పరంగా మరొక విలువను ఒకే సందర్భంలో నిర్ణయించడం సాధ్యం కాదు. అలానే సంస్కృతి విషయంలోనూ, ఎవరి సంస్కృతి వారికుండడం, ఆ సంస్కృతి వారి ప్రవర్తనను ప్రభావితం చేయడం నిజమే. అయితే మనం మాట్లాడుతున్నది మానవ సంస్కృతి గురించి. ప్రపంచం ఈనాడు మనకు అర్థమైన విధంగా మన సంస్కృతి ఎలా మారాలి అని. నిత్యమూ పరిణామం చెందే జ్ఞానాన్ని ఆలంబనం చేసుకొని సంస్కృతి కూడా ఎప్పటికప్పుడే సంస్కరణ పొందాలనేది మానవ వాద భావం.

ఈ సందర్భంగా నాకొక సంఘటన గుర్తుకు వస్తున్నది. 1949లో ముస్సోరీ రాడికల్ హ్యూమనిస్టు అధ్యయన శిబిరంలో శీలం (Ethics) పై చర్చ జరుగుతున్నప్పుడు చైతన్యానికి – నీతికీ మధ్యవున్న సంబంధం గురించి ఎం.ఎన్.రాయ్ దృష్టికి నేనొక ప్రశ్న తీసుకువెళ్లాను. ''కొన్ని ఆటవిక జాతులకు మన వంటి అతిథులు తటస్థించినపుడు, వారు చాలా ఆదరంతో చూచి అతిథ్యమిస్తారని విన్నాను. అందులో మానవతా నైతిక భావం లేదా? అని ప్రశ్నించాను. ''వారి స్త్రీలు నగ్నంగా ప్రదర్శించే స్తనాలపై (అవికాకుంటే మరో అవయవంపై) నీవు నిశితంగా దృష్టి సారిస్తే, అప్పుడు తెలుస్తుంది నీకు వారి సమాదర భావం'' అని ఠక్కున సమాధానం చెప్పాడు రాయ్.

మన ప్రవర్తనపై మన సంస్కృతి ప్రభావం ఉంటుంది. కాబట్టి మనం సెక్యులర్ యన్ సంస్కృతికాక, చైతన్యంతో కూడిన మానవ సంస్కృతి కావాలంటున్నాం. ఈ దృష్ట్యా లేడీ డాక్టరుగారి రిడిల్ కు కూడా పరిష్కారం దొరుకుతుంది. ఆమెలో సతీ సుమతి సంస్కృతి జీర్ణమైవుంటే, పడవవాణ్ణి శపిస్తుంది. కుమారి వేదవతీ సంస్కృతికలదైతే ఎట్నోదూకి చచ్చిపోతుంది. ఆమెది అహల్య సంస్కృతి అయితే, పడవ వాడి కోర్కె తీర్చడానికి సిద్ధపడుతుంది. ఇవి సంభావ్యతలు'. ఈ నిర్ణయాల నేపథ్యంలో వారి వారికి అలవాటైన హైతుక స్థాయి వుంటుంది. సంస్కృతి స్థాయి వుంటుంది. విలువలెంత సంకుచితమైతే, సంస్కృతి అంత సంకుచిత మవుతుంది. వివరించజాలని వాటిలో వెదికితే, వివరించలేని విలువలు, వివరించలేని సంస్కృతి దొరుకుతాయి.

కేవలం భౌతికావసరాలకు పరిమితమైనది సమగ్ర భౌతికవాదం కాని మాట నిజమే. కాని, మానవపదులు పరిగణనలోకి తీసుకొనేది తాత్విక భౌతికవాదాన్ని (Philsophical Materialism). దాన్నే వారు భౌతిక వాస్తవికవాదం (Physical Realism) అంటారు. భౌతిక ద్రవ్యాన్నీ,

దాని ప్రవృత్తి (Function)నీ, ధర్మాల (Propertics) నూ మొత్తాన్నీ కలిపితేనే భౌతిక ఉనికి అవుతుందని వారికి తెలుసు. వారి ప్రకారం అస్తిత్వమంతా భౌతికమే. కాబట్టి విశ్వంలో సర్వమూ ఎలాగో, అలాగే మనిషి కూడా అణునర్తనమే. మనం ప్రకృతిలో దర్శించే అణునర్తనం అనంత వైవిధ్యంగా వుంది. ఇందులో దేనికి దాన్నిగా తీసుకున్నప్పుడు ప్రతిదీ అద్వితీయమే. ఒకదానివలె మరొకటి వుండదు. అందుకే జె.బి.ఎస్. హాల్డేన్ A rose roses, A horse horses అంటాడు. A rose lives, A horse lives అనడం సరికాదంటాడు. ఎందుకంటే దేని జీవనం తీరు దానిదే. అలానే మనిషి జీవనం తీరు వేరు. అంత మాత్రాన అతను 'అణుసంఘటన' కాదనీ, అతని ప్రవర్తన 'అణు నర్తనం' కాదనీ అనలేము. అతనిలో ఆ ప్రక్రియలు మిగతా వానిలోని ప్రక్రియల కంటె అతిభిన్నంగాను, అనంత భిన్నంగాను వుండవచ్చు. అందులోని అనేక అంశాలను ఆధునిక విజ్ఞానం ఇప్పటికే వివరించింది. అందని అంశాలింకా వున్న మాట నిజమే. అయితే వాటిని నివరించ జాలము అంటూ చేతులెత్తి వేసే స్వభావం ఆధునిక విజ్ఞానిది కాదు. ఆ రీతిని మానవవాదం వూహించను కూడా లేదు. మనిషి లక్షణాలు మనిషికే వున్నాయి. అతని వంటి వాడు అతనే, అందుకే మనిషి యూనిక్ – అనన్యం అంటాము. అంత మాత్రాన మనిషిని ఏమే మిగానో వూహించలేక, భావవాద వూబిలో కూరుకుపోనవసరం లేదు.

ఈ విషయాలను ఇలా అర్థం చేసుకొనేదే మానవవాదం, వివరాల్లో విభేదముండ వచ్చు కాని, మౌలిక విషయాల్లో మానవవాదుల మధ్య అంగీకారం వుంది. హ్యూమనిజమూ, హ్యూ మనిటేరియ నిజమూ ఒకటే అనే వారిని నేను కొత్తగా చూస్తున్నాను. వెంకటేశ్వరరెడ్డిగారిలో హ్యూమనిటేరియనిజంలోని కారుణ్యభావం హ్యూమనిజంలో కూడా వుంటుంది తప్ప, రెండూ ఒకటి కావు. సమ్యక్ దృక్పథంకల హ్యూమనిజం (మానవవాదం) విశాలమైనది, పరిణామ స్వభావం కలది. మానవవాదులంతా అవశ్యంగా మానవతావాదులవుతారు కాని, మానవతావాదులు మానవవాదులు కానవసరం లేదు.

కాగా, మానవ స్వభావం దుర్గ్రాహ్యమనే వారు మానవవాదులూ కారు, మానవతావాదులూ కారు. ★★★

## Princess Anne barred from driving

Magistrates banned Princess Anne from driving for a month after she was stopped for speeding twice in one week.

The 40-year-old daughter of Queen Elizabeth II, who was not in court, admitted driving 123 kph on August two and 144 kph on August nine on Fosse Way, near Stow, in the scenic Cotswalds, northwest of London.

Magistrates announced they were imposing a 100-pound fine and a one-month disqualification for the 90 mph violation, and fining the princess 50 pounds for the other speeding offence. They also ordered her to pay ten pounds for prosecution costs.

# కులాలను ఆధారం చేసుకొనడం, నికృష్ట చర్య

**మండల్ కమీషన్ I**

(శ్రీ మధు లిమాయే పాత సోషలిస్టు నాయకుడు. ఆయనతో గోష్ఠి వలన రిజర్వేషన్ల సమస్యకు గల కొన్ని లక్షణాలు విదితం అవుతున్నాయి. చాలా లక్ష్యాలుంటాయి. చాలా లక్షణాలూ ఉంటాయి. ఇది ఒక ప్రముఖ రచయిత వెలుబుచ్చిన అభిప్రాయాలు.

*గమనిక:- పై అభిప్రాయాలు వి.పి. సింగ్ ప్రభుత్వం పడిపోకముందు వెలిబుచ్చినవని గ్రహించవలెను).*

మండల్ కమీషన్ ఆసరాగా ప్రధాని వి.పి. సింగ్ తీసుకున్న తొందరపాటు నిర్ణయం ఈ రిజర్వేషన్ల ప్రకటన. ఇది ''విభజించి నష్టపో'' బాపతు చర్య. సాంఘిక విపత్తులను కలిగించే నిర్ణయం.

రాజీవ్ గాంధీ, 1986లో ''షాబానూ'' వ్యవహారంలో ఇటువంటి తప్పిదం చేశాడు. ముస్లిం సనాతకుల వత్తిడికి లొంగిపోయాడు. లొంగుబాటు ద్వారా ఓట్లను పదిలం చేసుకుంటున్నారనే భ్రమ కలిగింది. సనాతనుల నిరసనావళిని చూసేసరికి, కాళ్లు చల్లబడి, వాళ్లను సంతృప్తి పరచాలని నిర్ణయించుకున్నారు. ముస్లిం సనాతనులు సంతుష్టులవుతారనే ఊహించారు. కానీ, దానివలన హిందూ ఓట్లు నష్టమవుతవని ఊహించనే లేదు. హిందూ ఓట్లు రావు అనే భయం తర్వాత తర్వాత కలిగింది. దీనికి తోడు అయోధ్య వద్ద శిలాన్యాస తతంగం వచ్చిపడింది. ఫలితం చూస్తున్నాం.

రాజకీయవాదులలో పేరాశకు సరితూగే దూరదృష్టి ఉండదు. ఈ విషయంలో రాజీవ్ గాంధీ కంటే వి.పి. సింగ్ కొంత మెరుగు. రాజీవ్ గాంధీ ఓట్లు పోగొట్టుకున్నాడు. వి.పి. సింగ్‌కు పూర్తి నష్టం వాటిల్లక పోవచ్చు.

కానీ వి.పి. సింగ్ దారి తప్పుతున్నట్లే. అతడు ఏ ఏ అభిప్రాయాల సంయోజన ద్వారా ప్రధాని అయినాడు? ఇప్పుడు అతడు తీసుకున్న నిర్ణయం, వాటికి అనువైనదేనా? అందరి అభిప్రాయాలనూ తీసుకుని తగు నిర్ణయాలు తీసుకొనడం అతడి కార్యాచరణ తత్వానికి ఆధారం. అదే కదా అతడు పదే పదే చెప్పున్నది. అట్లా చేస్తే తన బలహీన ప్రభుత్వానికి, బలం చేకూర్చుతున్న కుడి ఎడమల వారితో సయోధ్య నిలుస్తుంది. తనే ''మంచివాడు'' అనే భావన కల్పించుకొనడం అతడికి నష్టం. అతడు కుడి ఎడమల దయ వలన ''మంచివాడు'' అవుతూ ఉండాలి. ప్రతి సందర్భములోనూ కుడి ఎడమల మద్దతు కోసం తంటాలు పడడం, అతడి పదవీ హోదాకు

తగదని అనుకుంటే, అది ఎంత వరకు సాగుతుంది? రాజకీయ ప్రయోజనం కోసం ఏదో ఒక ''టక్కు''ను ఆశ్రయించు కుంటే, ఏదో ఒక రోజున దానిని మరిచి పోయి వ్యవహరిస్తే, అది ఆపదలు కలిగించడం తథ్యం. మరిచే పోవడానికి పెద్ద కారణాలు ఉండక పోవచ్చు. మరిచే పోవడం తప్పిదం కాక తప్పదు.

అల్ప సంఖ్యాక ప్రభుత్వం, తన మద్దతు దార్లను సంప్రతించకుండా ఇటువంటి భారీ నిర్ణయాలు తీసుకొనరాదని బిజెపి అంటున్నది. నిజమే కదా. తాము ఎన్నికల వాగ్దానాలలో ఈ నిర్ణయం తీసుకుంటామని చెప్పే ఉన్నాం అని జనతా దళం వాదించినప్పటికీ, బిజెపి వారి అభ్యంతరం సబబే అవుతుంది కదా. ఎన్నికల వాగ్దానాలలో ఏమి చెప్పినప్పటికీ, ఆకాశవాణి, దూరదర్శన్‌లలో పూర్వ ప్రభుత్వం అనుసరించిన పద్ధతులనే వి.పి. సింగ్ ప్రభుత్వమూ అనుసరిస్తున్నది!

ఏది ఏమైనప్పటికీ ఈ రిజర్వేషన్లపై వి.పి. సింగ్ ప్రకటన సరియైన సమయంలో జరగలేదు. దీనివలన అతడి ''ఆకర్షణ'' దెబ్బ తిన్నది. ఆయన గారికి వెనుకబడిన కులాల పట్ల అంత ఆప్యాయత ఉన్నట్లుంటే, అభిప్రాయ సేకరణ కోసం మిత్ర పక్షాలతో సంప్రతింపులు కాల నష్టం కలిగిస్తే యని అనుమానం ఉన్నట్లుంటే, పదవిలోకి చేరుకున్న సమయంలోనే ఈ నిర్ణయాన్ని ప్రకటిస్తే ఘనంగా ఉండేది. అట్లా చేసినట్లుంటే మొత్తం సమరంలో దెబ్బ తిన్నప్పటికీ, కొన్ని ప్రధాన సంకుల సమరాలలోనైనా గెల్పు పొందేవాడు

నిజానికి, రిజర్వేషన్లకు ప్రతికూలవాదులు కూడా కొన్ని కాదనలేరు కదా. ''జనాభాలో ఐదు శాతం బ్రాహ్మణులు. వాళ్లు కేంద్రంలో రాష్ట్రాలలో యాభై శాతం కార్యనిర్వాహక పదవులలో చేరుకోగలిగారు. యాభై రెండు శాతం ఉన్న ఇతర వెనుకబడిన కులాలలో ఒక్కడు కూడా ఇప్పటికి సుప్రీం కోర్టు జడ్జి కాలేదే'' అని ఒక విమర్శ దాన్ని ఎవ్వరూ కాదనలేరు కదా!

కాని ఈ వాదం ప్రమాదకరమా? చెప్పే వాళ్లు ఉన్నారు. ఇట్లా గణాంక వివరాలు చెప్తే, ఉద్రేకాలు పెరగడం తప్ప, సమస్య పరిష్కారం కాదు. పైగా పాత కులతత్వం చేసిన అక్రమాలను ఇట్లా కులతత్వంతో పరిష్కరిస్తే, సమస్య మరీ జటిలం అవుతుంది. దానివలన కుల ద్వేషాలు తుడిచిపెట్టుకు పోవడానికి మారుగా మరింత విజృంభిస్తాయి. అందువలన బి.పి మండల్ చేసిన సిఫార్సుల కంటే ఉత్తమమైన కార్యాచరణ పద్ధతులను చేపట్టాలి.

విచిత్రం ఏమంటే, మనం పలువురం కులం పద్ధతి ''తుడిచిపెట్టుకు పోతున్న''దని అనుకుంటున్నాం. తీరా మండల్ కమీషన్ మూలంగానూ, వి.పి. సింగ్ మూలంగానూ ఇది ''తుడిచి పెట్టుకున్నది'' అని కళ్లు తెరుస్తున్నాం.

సయ్యద్ షాబుద్దీన్ (ఇన్‌సాఫ్ పార్టీ) నిజంగా భలే తిరుమంత్రం చెప్తున్నాడు. మతాల వారీగా, కులాల వారీగా, వర్గాల వారీగా అన్ని విభాగాల వారీగా, రిజర్వేషన్లు ఉండాలని ఆయన బోధ. మండల్ సిఫార్సుల అమలుకు అదే చరమ లక్ష్యం అనాలి.

ఇంతకూ వి.పి .సింగ్ పరిపాలనా చతురుడు కాడు. కేవలం రాజకీయ చతురుడు. అతడు తన జీవితంలో ఏమేమి ఘనకార్యాలు చేశానని చెప్పుకున్నప్పటికీ, రాజకీయ ప్రయోజకుడుగానే కొనసాగడం అతడి లక్ష్యంగా కనబడుతుంది. నిజానికి అతడు రౌడీలకు ఓటు ఇవ్వవద్దు అని గత ఎన్నికలలో చెప్పడం సాహసమే. జనతాదళ్ అభ్యర్థులలో రౌడీలకు ఓటు ఇవ్వవద్దు అనడం సాహసమే కదా. ఉన్నాయి కొన్ని గుణగణాలు. అందువలననే అతడి బహిరంగ సభలు ప్రశాంతంగా నడుస్తూ ఉంటాయి. ఎవ్వరూ అడ్డు మాటలు పలకరు. వెనకటి ప్రధాని లాగా అప్రయోజకుడని ఎవ్వరూ అనుకోరు. వి.పి. సింగ్ ఏదో దాస్తున్నాడని గానీ, అసమర్థతను కప్పి పెట్టుకుంటున్నాడని గానీ, ప్రజల పట్ల ఉదాసీనుడని గానీ, ఎవ్వరూ అనుకోరు. ఇప్పుడు అట్లాంటి సద్భావన మాయం అవుతున్నది. ప్రతికూల శక్తులు తల ఎత్తుతున్నాయి. మరికొన్ని నెలలైనా పదవిలో కొనసాగడానికి ఎటువంటి రాజకీయ జిత్తులయినా వేస్తాడనే భావం వ్యాపిస్తున్నది, ప్రబలమవుతున్నది.

ప్రజలలో వ్యాపిస్తున్న ఈ భావభారాన్ని సింగ్ మోయలేడు. నలుగురితో సంప్రతించి మండల్ కమిషన్ సిఫార్సుల అమలు తీరును నిర్ణయించుకుని ఉన్నట్లుంటే బాధ్యత తేలిక అయ్యేది. ఆ రీత్యా రిజర్వేషన్ పద్ధతికే ఒక కొత్త రూపం ఇవ్వగలిగేవాడు. ఆ రీత్యా తమకంటే తక్కువ కులాల వారిని తక్కువగానే చూస్తూ, ఎక్కువ వారిని ఈసడించుకుంటూ గడపగల ఒక. కొత్త వర్గాన్ని సృష్టించకుండా ఉండగలిగేవాడు.

ఇప్పటికీ పెద్దగా మించి పోయిన దేమీ లేదు. ఇప్పటికీ రాజీవ్ గాంధీ చేసిన తప్పిదాల లాంటి తప్పిదాలు చేయకుండా ఉండవచ్చు. అతడు సనాతన మౌఢ్యానికి లొంగిపోయి, షాబానూ, సాల్మన్ రష్దీ వ్యవహారాలలో కొత్త మార్గం తొక్కలేక పోయాడు. అదే గతి వి.పి. సింగ్‌కూ పట్టవలెనా?

చేసిన తప్పులు దిద్దుకోవాలంటే, కొన్ని నైతిక నియమాలు ఉండాలి. దేవీలాల్ పట్ల భయం ప్రధానం అంటే, తప్పులు దిద్దుకొనడం అసాధ్యం.

భారతదేశంలో 3743 కులాలు ఉన్నాయి. ఎన్నికల కోసమని ఈ కులాలను ఆధారం చేసుకున్న ముఠాలకు లొంగరాదు. అదీ నాయకత్వ లక్షణం. ఈ సత్యాన్ని జగ్జీవన్‌రాం తన చరమ దశలో గ్రహించుకొనగలిగాడు. అతడికి తాను హరిజన నాయకుడను అనిపించుకొనడం ఇష్టం ఉండేది కాదు. అతడు నాయకుడు, అందరికీ.

మరొక విషయం. వి.పి. సింగ్ విస్మరించరాని సత్యం మరొకటి. వి.పి. సింగ్‌కు ఆరాధ్య వీరుడు అంబేడ్కర్ కాదు. అతడి ఆరాధ్య వీరుడు లాల్ బహదూర్ శాస్త్రి. ఆ సంగతిని అతడే మరిచేపోరాదు. ★

# రిజర్వేషన్లు ఉండాలి

— మధు లిమాయే

మండల్ కమీషన్ II

*(రిజర్వేషన్లకు అనుకూలంగా, వ్యతిరేకంగా, ఆందోళనలు కొనసాగుతూ, దేశంలో అల్లకల్లోలం కలిగిస్తున్నాయి. ప్రముఖ సోషలిస్టు నాయకుడు శ్రీ మధు లిమాయే ఈ సమస్యపై వెలుబుచ్చిన అభిప్రాయాలు.)*

*ప్రశ్న: జరుగుతున్న ప్రతికూల ఆందోళన సబబేనంటారా?*

శ్రీ లిమాయే: సబబు కాదు. స్వప్రయోజనాల కోసం కొందరు ఇట్లా విద్యార్థులను అపమార్గం పట్టిస్తున్నారు. కొన్ని వార్తాపత్రికలు కూడా ఇదే ధోరణి నవలంబించాయి. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సంపాదకుడు అరుణ శౌరీ ఎనిమిది వ్యాసాలు వ్రాశాడు. అన్నీ వ్యతిరేకంగానే. ఆర్థిక, సాంఘిక వెనుకబాటుతనం గానీ, రాజ్యాంగ నిర్దేశాలు గానీ అతడికి అనవసరం. పైగా తాను నెహ్రూ కంటే అంబేడ్కర్ కంటే బుద్ధిమంతుడనని అతడి నమ్మకంగా కనిపిస్తున్నది. ఇది నిష్పాక్షిక రచనావళి అవుతుందా? ఈ దేశంలోని ఆర్థిక, రాజకీయ సంస్థలన్నీ ఈ సమస్య పైన ప్రతికూలంగానే వ్రాస్తున్నాయి. విద్యార్థులను రెచ్చగొడ్తున్న వారు వీళ్ళే.

*ప్రశ్న: కులాన్ని ఆధారం చేసుకునే కంటే, ఆర్థిక స్తోమతను ఆధారం చేసుకుంటే బాగుండవచ్చు.*

శ్రీ లిమాయే: రాజ్యాంగాన్ని అనుసరించాలి. రాజ్యాంగ సభలో తలపండిన న్యాయశాస్త్రవేత్తలు, స్వాతంత్ర్య సమర మహా నాయకులు ఉన్నారు. వాళ్లు ''ఆర్థికమైన వెనుకబాటు'' అనే మాటలు ఉపయోగించ లేదేమి? ''ఇతర వెనుకబడిన కులాలు'' అనే మాటల ప్రాధాన్యం వాళ్లకి బాగా తెలుసును. వాళ్ల వద్ద 1921 నాటి, 1931 నాటి జనాభా లెక్కలు, కులాల వారీగా ఉన్నాయి. వాళ్లకు ''సాంఘికంగా, విద్యా విషయకంగా వెనుకబడిన కులాలు'' అనే పద సముచ్చయానికి అర్థం బాగా తెలుసు. వాళ్లు వ్యక్తుల కోసం కాక బృందాల కోసం రాజ్యాంగాన్ని నిర్మించారు. అందువలన జగ్జీవన్‌రాం కుటుంబానికి రిజర్వేషన్ లాభం ఉంటుందా అనే వ్యక్తిగత ప్రశ్న చొప్పదంటు ప్రశ్న. సాంఘికంగా వెనుకబాటుతనానికి వాళ్లు ప్రాధాన్యం ఇచ్చారు. మనకు కులంపైన ఆధారపడిన సాంఘిక వ్యవస్థ ఉన్నది. మన సంఘం మూడు భాగాలుగా విభాజ్యమై ఉంది. త్రైవర్ణికులు, బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు ఒక వర్గం; ద్విజులు, శూద్రులు, అద్విజులు. అంత్య జాతులు అనే అనుసూచిత కులాలు, అనుసూచిత జాతులు.

ఈ విధమైన సాంఘిక విభజనకు వేలాది సంవత్సరాల ఇతిహాసం ఉంది. నేటికీ ఇవి ఉన్నాయి. వాస్తవాలు! అందువలన సాంఘికమైన వెనుకబాటుతనానికీ, విద్యా విషయక

మైన వెనుకబాటుతనానికి ఒకే తాత్పర్యం చూడగలిగారు.

*ప్రశ్న: ఆర్థికంగా వెనకపడడం అనే భావన తప్పంటారా?*

**శ్రీ లిమాయే:** గోపాలకృష్ణ గోఖలే, అల్లాడి మొదలైన ప్రముఖులు కూడా పేద కుటుంబంలో పుట్టారు. కానీ వారు బ్రాహ్మణులు. బ్రాహ్మణులకు చిరకాలంగా విజ్ఞాన సముపార్జనా సంప్రదాయం ఉంది. అందువలన గోఖలేకు, అల్లాడికి జ్ఞాన సముపార్జనలో పేదరికం అడ్డు రాలేదు. ఉన్నత పదవి చేరుకొనగలిగారు. ఈ సంప్రదాయం బ్రాహ్మణులకు వర్తిస్తుందని రాజ్యాంగ నిర్మాతలు తలపోశారు. అందువలననే సాంఘికంగా, విద్యా విషయకంగా వెనుకబడిన వారు అనే మాటలు ఉపయోగించారు. వెనుకబడిన కులాలలో చదువుకున్నవారు చాలా తక్కువగా కనపడ్డారు. పదేళ్లు వచ్చేసరికి, బాలుడు గానీ, బాలిక గానీ, సంపాదన మార్గం అనుసరించ వలసినదే. ఇది తెలిసినందువలననే 1955లో నియమించిన కాకాసాహెబ్ కాలేల్కర్ కమీషను, 1979లో నియమించిన మండల్ కమీషను, కులాన్నే ఆధారంగా తీసుకున్నాయి.

*ప్రశ్న: 1931లో సేకరించిన కులాల జనాభా లెక్కలు ఎంతవరకు నమ్మదగినవి? నేటి పరిస్థితులకు అనువర్తిస్తాయా?*

**శ్రీ లిమాయే:** సరియైన, శాస్త్రీయమైన పద్ధతిని విస్మరిస్తున్నాం చేయాలంటే, కులాల జనాభా లెక్కలే అక్కరకు వస్తాయి. తగు లెక్కలను కేంద్రం సేకరింపజేయాలి. రాష్ట్రాల లెక్కలపైన ఆధారపడరాదు. ఈలోగా, మండల్ కమిషన్ చూపిన లెక్కలు సరికావు అనే నెపంతో పని ప్రారంభించకుండా నిరీక్షిస్తూ కూర్చోరు. మండల్ కమిషన్ ఇచ్చిన లెక్కలు సమస్య తీవ్రతను తక్కువగా చూపెట్టి ఉంటాయి. అందువలన గత నలభై ఏళ్లలో వెనుకబడిన కులాల వారికి దక్కవలసిన ఆరోగ్య నిధులు దక్కకపోయి ఉండవచ్చు. పెరిగిన వారి జనాభాకు అనుగుణంగా నిధులు పెరిగి ఉండకపోవచ్చు. పైగా, వారికి పరిమిత కుటుంబ ప్రయోజనాల విజ్ఞానం కూడా అందుబాటు కాకుండా పోయి ఉండవచ్చును. అందువలన కూడా వారి జనాభా పెరిగి ఉండాలి.

*ప్రశ్న: కమిషన్ సిఫార్సులను అమలు చేస్తే ప్రతిభకు ఉచిత స్థానం ఉండదనీ, ప్రజాహిత జీవన సరళి క్షీణిస్తుందనీ ఆందోళన వ్యక్తం చేస్తున్నవారున్నారు.*

**శ్రీ లిమాయే:** ప్రతిభ కనుక ప్రధానమైనట్లుంటే, పరిపాలనను నడిపేవారు, దేశాన్ని సురక్షితం చేయవలసి ఉంది. స్వాతంత్ర్యము వచ్చినప్పటినుండి పై కులాల వారే ఈ దేశాన్ని పరిపాలిస్తున్నారు. మరీ పురాణ కాలం సంగతి కాదు. ఎనిమిదవ శతాబ్దం నుంచీ అగ్రకులాల వారే పరిపాలిస్తున్నారు. క్షత్రియులు, కాయస్థులు, బ్రాహ్మణులు వగైరాలు. 1962లో చైనాతో యుద్ధం వరకూ ఇదే తంతు. అప్పుడు ప్రధానమంత్రి, జవాహర్‌లాల్ నెహ్రూ సేనాపతి జనరల్ కౌల్. వాళ్లు చేసినదేమిటి? ప్రత్యేకించి చెప్పనక్కర లేదనుకుంటాను. దేశాన్ని సంరక్షించవలసిన ప్రాథమిక బాధ్యతను కూడా నిర్వర్తించలేకపోయారు. ఇక ప్రతిభను గురించిన ఈ

ఆసక్తులు ఎంత నిస్సారమో చూడండి. పరిపాలనను పరిశుద్ధంగా, అవినీతికి దూరంగా, ప్రజోపయోగకరంగా, ఆదర్శ వంతంగా చేస్తామని తరచూ అంటూ ఉంటారు. ఏమవుతున్నది? ఏదీ ప్రతిభ? తెల్లదొరలు పోయి నల్లదొరలు వచ్చారు. అవినీతి, లంచగొండితనము ఎన్నిరెట్లు పెరిగిందో సగటు మానవుడికి గూడా తెలుసు. ఇన్ని ఏళ్ళుగా ఈ సాధనలన్నీ చేస్తానన్నవారు, వీటిని నిర్వహించిన పెద్ద వారు ఎవ్వరూ అనుసూచిత కులాల వారూ కారు, అనుసూచిత జాతుల కారు కదా. అగ్రకులాల వాళ్లు పరిపాలన ద్వారా తమ ఆధిపత్యాన్ని మాత్రం నెరపుకున్నారనాలి. వేరెవ్వరికీ దక్కకుండా ఆధిపత్యాన్ని అను భవిస్తున్నారనాలి. అసత్యము కాదు.

ప్రశ్న: వెనుకబడిన కులాలకనీ, అను సూచిత కులాలకనీ, అనుసూచిత జాతుల కనీ రిజర్వేషన్లు చేసినప్పటికీ, అనుభ వంతో జరిగేది, వాళ్లలో ఆర్థికంగా మెరుగు జీవితాన్ని గడుపుతున్న వర్గాల వారే ఈ ప్రయోజనాలను అనుభవిస్తారనే శంక ఉన్నది

శ్రీ లిమాయే: అగ్ర కులాలతో జరిగే విశేషం చూడండి. వాళ్లల్లోనూ ధనికులూ, పలుకుబడి గల వారే కదా అన్ని ప్రయోజ నాలు పొందుతున్నారు. అగ్ర కులాల లోనూ పేదలు ప్రయోజనాలు సరిగా పొందలేకుండా ఉన్నారు కదా. అగ్రకులా లలో ధనికులే భోగ భాగ్యాలు అనుభవిస్తు న్నారు. అందువలన, అగ్రకులాలలోని ఆర్థి కంగా, వెనకబడిన వారికి యాభై శాతం రిజర్వేషన్ కల్పిస్తే బాగుంటుంది కదూ. దీనికి ఎవ్వరైనా ఒప్పుకుంటారేమో కను క్కోండి. ఒక్కడు దొరకడు. ఈ ఇరవై ఏడు శాతం రిజర్వేషన్ల పథకాన్ని ప్రారం భిస్తే, కొత్త బృందాలు కొన్ని దీని పరిధి లోకి రావచ్చు. నా వర్గీకరణ ప్రకారం, వెనుకబడిన తరగతులు అనీ, ముందుప డిన తరగతులు అనీ ఏవీ లేవు. నా లెక్క ప్రకారం హిందూ సంఘం ఏర్పాటులో ఉన్న మూడు తరగతులే ముఖ్యం. అద్వి జులు అందరూ ఈ పరిధిలోకి వస్తారు. జనాభాలో అటువంటి వారెందరు? ఎవరు ఎందరెందరున్నారు? ఒక్కొక్క బృందం తన వాటా ప్రయోజనం పొందుతుంది. యాదవులు తమ నాలుగు శాతం పొందు తారు. అందూ ఇట్లాగే మెల్లగా, ఒక క్రమంలో, ప్రయోజనం పొందుతారు.

ప్రశ్న: మతాన్ని బట్టి కూడా రిజర్వే షన్లు చేయాలంటున్నారు. మీరేమంటారు?

శ్రీ లిమాయే: కేవలం మతం పేరిటనే రిజర్వేషన్లు కల్పించడానికి నేను వ్యతిరే కిని. కానీ ముస్లిములలో కులాలున్నాయి. అగ్రకులాలైన షేకులు, సయ్యద్‌లు అన్ని ప్రయోజనాలనూ కాజేస్తున్నారని వాపోయే పేద కులాలున్నాయి. కేంద్రం ఒక జాబితా తయారు చేసి, దానిలో ఇటువంటి ముస్లిం కులాలను చేర్చాలి. మండల్ కమిషన్ నివే దికలో ఇటువంటి జాబితా రచనకు వీలు కల్పించారు. అటువంటి వారిని వేరే కులం అనండి. కొన్ని వృత్తులు చేసుకునే వార నండి. వాళ్ల అభ్యున్నతికి తోడ్పడితే సరి.

ప్రశ్న: విద్యారంగంలో వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు ఇవ్వడంపై మీ భావం ఏమిటి?

శ్రీ లిమాయే: ఆందోళన చేస్తున్న విద్యార్థుల పట్ల, ఈ విషయంలో నాకు కొంత సానుభూతి ఉంది. విద్య పట్ల కేటాయింపులను ప్రభుత్వం రెట్టింపు చేయాలి. విద్యావకాశాలు పెంచాలి. ఈ సందర్భంలో ఒక విషయమై ఆలోచించుదాం. క్యాపిటేషన్ ఫీజు తీసుకుని సీట్లు అమ్ముచున్నారు కదా. దానికి వ్యతిరేకంగా ఎవ్వరూ ఆందోళన చేయలేదేమి? ఒక్క బస్సు కూడా కాల్చనే లేదేమి? ధనం కలవారికే కదా క్యాపిటేషన్ ఫీజు ద్వారా సీట్లు లభిస్తాయి! అది అట్లా ఉంచి, మన దేశం నుంచి ఇతర దేశాలకు వెళ్లిపోతున్న విద్యావంతుల విషయం కూడా ఆలోచనీయమే కదా. భారతదేశంలో విద్యా వ్యవస్థను నిర్వహించడానికి పేద ప్రజల ధనం ఖర్చు చేస్తున్నారు. తీరా చదువుకున్న డాక్టర్లు, ఇంజనీర్లు అమెరికాకు వలస పోతున్నారేమి? దీనిపైన నిరసన ప్రకటించవద్దా?

ప్రశ్న: వివిధ రాజకీయ పక్షాలు అవలంబించిన వైఖరి పట్ల మీ అభిప్రాయం ఏమిటి?

శ్రీ లిమాయే: హరిజనుల సమస్యను చేపట్టి, మహాత్మా గాంధీ, మన సంఘపు పునాదులను కదిల్చాడు. కానీ గాంధీజీ సర్వజనాభిప్రాయాన్ని తీసుకున్నాడని అంటున్నారు కాంగ్రెసువారు. ఇది అసత్యం. తాను బాధపడి, అందరిలో చైతన్యాన్ని ప్రకోపింప జేశాడు మహాత్మా గాంధీ. అంతేగానీ సర్వజనాభిప్రాయాల కోసం ఆయన గోష్ఠులు నడపలేదు. ఈ సంగతి రాజీవ్ గాంధీ తెలుసుకొనాలి. కాంగ్రెసు వాళ్ల నిస్సార తీర్మానం ఒకటి రూపొందించారు. దాని ద్వారా కాంగ్రెసు సంప్రదాయాన్ని తుడిచి పెట్టారు. నంబూద్రిపాద్ తరుచు ప్రభుత్వం ఆర్థిక సమస్యను పరిష్కరిస్తుందా అని విలదీస్తున్నాడు. భలే నినాదం. అసలు ఇదంతా ఆర్థిక సమస్యా పరిష్కారం కోసం ఉద్దేశించినది అని ఎవరైనా అన్నారా? ఇప్పటి ప్రయత్నం అంతా దేనికి. ఈ వెనకబడిన ప్రజలకు కూడా రాజ్య నిర్వహణలో భాగస్వామ్యం ఇవ్వడానికి ఉద్దేశించినది మాత్రమే.

ప్రశ్న: ఈ వివాదం ఎప్పుడు అంతం అవుతుంది? దాని కోసం మీ ప్రతిపాదనలు ఏమైనా ఉన్నవా?

శ్రీ లిమాయే: డాక్టర్ రాంమనోహర్ లోహియా స్త్రీలకు కూడా రిజర్వేషన్లు ఉండాలన్నాడు. ఆ విషయం ఇప్పటి పథకం కిందకు రాదు. అయినా, స్త్రీలకు పది శాతం ప్రత్యేకంపు ఉంటుందంటున్నారు. అగ్ర కులాలలో ఆర్థికంగా వెనుకబడిన వారికి ఐదు శాతం రిజర్వేషన్ ఉండాలి. వెనుకబడిన వారి జాబితాను విస్తృత ప్రాతిపదికపైన, కేంద్ర ప్రభుత్వం తయారు చేయించాలి. దానిలో రెండు భాగాలు ముఖ్యం. భూమి గల కులాలు; భూమి లేని కులాలు. భూమి గల కులాల ఆర్థిక స్థితి నిర్ణయానికి తగు సూత్రావళి అవసరం. వాళ్లకు ఏదో కొంత బతుకు తెరువు ఉన్నదనేది విస్మరించరాదు. ''ఇతర వెనుకబడిన కులాలు - బీహారు'' అనేది ఒకటవ అనుబంధంలో ఉంది. వారిలో భూమి కలవారు అనేది రెండవ అనుబంధంలో ఉంది. ఇదే విధమైన వర్గీకరణ జాతీయ స్థాయిలో జరగాలి. కుల అభిప్రాయం ప్రాతిపదికపై జరగాలి. ★★★

# నేరము - శిక్ష
# అపరాధ పరిశోధక రాణి
# అగతా క్రిస్టి శతజయంతి

నేరాలు, ఘోరాలు అందంగా చిత్రించి, ఆకర్షణీయంగా పాత్రలలో యిమిడ్చి, కోట్లాది పాఠకులను ఆకట్టుకున్న ''నేరాల రాణి'', అగతా క్రిష్టికి శతవార్షి కోత్సవం జరుగుతోంది.

డిటెక్టివ్ సాహిత్యంలో అభిమానం వున్న వారికి అగతా క్రిష్టి ఆదిగురువు. నడచి వచ్చి పలకరించే ఆమె పాత్రలు, 40 ఏళ్ళుగా రంగస్థలంపై ఆడుతున్నా విసుగు పుట్టించని ''మౌస్ ట్రాప్'' ఆమె అద్భుత కళా సృష్టికి మచ్చుతునకలు.

కథలు, నాటకాలు, కవితలు, రేడియో దూరదర్శన్ రచనలు మంచినీళ్ళ ప్రాయంగా రచించిన అగతా క్రిష్టి ఇంగ్లాం డ్ లో అతిసామాన్య కుటుంబంలో 1890 సెప్టెంబర్ 15న పుట్టింది. మనోవికారాలు గల తల్లి ఆటంక పరుస్తున్నా, అగత బాల్య దశలోనే కవితలు అల్లింది. ఆమె వృత్తిరీత్యా నర్సు. ఒక రెడ్ క్రాస్ ఆస్పత్రిలో పనిచేసి ఔషధాల గురించి క్షుణ్ణంగా తెలుసుకు న్నది. అదే ఆమె డిటెక్టివ్ రచనల్లో ఎంతో ఉపయోగపడింది. 66 నవలలు రాసిన అగత కనీసం 41 నవలల్లో ఆత్మహత్యలు, హత్యాయత్నాలు, విషం కలిపి యివ్వడం వంటి సన్నివేశాలు సృష్టించింది. అందులో ఆమె ఔషధ పరిజ్ఞానం మెప్పుకు గురైంది.

ఆమె 30వ ఏట 'ది మిస్టీరియస్ హౌస్' రాసింది. తొలుత ఆరుగురు ప్రచురణ కర్తలు అచ్చేయడానికి నిరాకరించిన అనం తరం ఆమె కీర్తి అందుకున్నది. అంతే, ఇక తిరుగు లేదనిపించింది. ఆమె సృష్టించిన ప్రతిరచన దిగ్విజయ యాత్రచేసి పాఠకుల కును ముంచెత్తాయి. ఎత్తుగడలు, ప్లాట్ అల్లడం, సస్పెన్స్, అతిసులభంగా క్లిష్టమైన విషయాన్ని చెప్పడం అగత శైలిలో అడుగ డుగునా కనిపిస్తుంది. అన్ని రకాల పాఠకు లను ఆకట్టుకునే వైవిధ్యం ఆమె రచనల నిండా తొంగి చూస్తుంటుంది. కొట్టొచ్చి నట్లు కాకపోయినా, అంతర్లీనంగా అగత నీతిని తీసుకొచ్చే యత్నం చేయకపోలేదు. దుష్టశిక్షణ శిష్టరక్షణ కూడా అశేష పాఠకుల ఆకర్షణకు ఒక కారణమేమో!

ఆమె రెండో పెళ్ళి మాక్స్ మల్లో వన్ తో జరిగింది. ఆమె జీవితంలో అదొక ఆనందదాయకమైన పెద్ద మలుపు. కావలసి నంత తీరిక, చదవడానికి ఓపిక అగతకు లభించాయి. భర్త ప్రోత్సాహం వుంది. అదంతా ఆమె రచనలకు ఎంతో దోహదం చేసింది.

అగతా క్రిష్టి పాత్రలు అన్నీ జీవితంలో ఎక్కడో చోట ఎదురైనవే.

హెర్క్యూల్ పోయ్‌రాట్ పాత్ర డిటెక్టివ్ సాహిత్యంలో చెరిగిపోదు. అలాగే మిస్

మార్పిల్ కూడా. కొన్నిసార్లు యీ సజీవ పాత్రలు ఆమె ఉద్దేశాలకు ఎదురు తిరిగి, అగతను నిస్సహాయురాలుగా చేసేవి! ఆమె రచనలన్నీ బేరీజు వేస్తే యించుమించు 2వేల పాత్రలు కనిపిస్తాయి. మానవ స్వభావంలో వైవిధ్యాన్ని చూపాలంటే అన్ని పాత్రలు అవసరమయ్యాయి. మధ్యతరగతి పాత్రల్నే అగత సృష్టించిందని అక్కడక్కడా విమర్శలు లేకపోలేదు.

అగత రాసిన 'మౌస్‌ట్రాప్' 1952 నుండే విర్విరామంగా రంగస్థలంపై ప్రతిరోజూ ప్రదర్శించుచున్నారంటే నమ్ముతారా? తరాలు మారినా, వారిలో అంతరాలు ఎన్నివున్నా, అగతా క్రిష్టి యీ విషయంలో కాలాతీత వ్యక్తిగానే నిలచిపోతున్నది. రాణి మేరీ గౌరవార్థం ఒక నాటకం రాయమని బ్రిటిష్ బ్రాడ్ కాస్టింగ్ (B.B.C) వారు అడిగితే ''మౌస్ ట్రాప్'' తయారైంది. ఆమె నాటకాలు మొత్తం 16 మాత్రమే. దూరదర్శన్ వీటిని తెరపైకి మలచుకున్నది.

అగతా క్రిష్టి కలం పేరు మేరీ వెస్ట్ మాకట్. ఆ పేరుతోనే నవలలు రాసింది. ఈ పేరుతో 15 సంవత్సరాలు రచనలు చేసిన తరువాతగాని ఆమె అగత అని బయటపడలేదు! 'ఎ డాటర్స్ డాటర్', 'జయంట్స్ బ్రెడ్' వంటి నవలలు మనోచిత్రణ చేసిన తీరు, విలక్షణ రచనలు అయినప్పటికీ, అగతా క్రిష్టి పేరుకు వచ్చిన ఖ్యాతి వీటికి రాలేదు.

అగతా క్రిష్టి శతజయంతి సాహితీ ప్రపంచానికి ఆహ్లాదకర, చిరస్మరణీయ మధురానురాగమే.

డిటెక్టివ్ సాహిత్యరంగంలో ఎందరో వెలసినా, అగతా క్రిష్టి స్థానం అద్వితీయంగా నిలచింది. ఆమె రచనలు అనితర సాధ్యాలుగానే కీర్తిని ఆర్జించుకున్నాయి. నిలిచిపోతాయి. ★

---

## Great Britain's New Prime Minister

**Conservative Party legislators elected John Major Tuesday to succeed Margaret Thatcher as the country's leader.**

**Profile of John Major**

| | |
|---|---|
| **Born:** | 29 March 1943, in Cheam |
| **Education:** | High school drop-out at age 16 |
| **Family:** | Married Norma Johnson in 1970; they have a daughter, 19, and a son, 15. |
| **Early Career:** | Executive of Standard and Chartered Bank for 14 years. Prior to his success in banking, Major Worked as a laborer and spent eight months on welfare. |
| **Political carerr:** | Elected to Parliament in 1979; appointed chief secretary to the treasury after the June 1987 general elections; chosen by Thatcher as foreign secretary in July 1989; named chancellor of the exchequer, the nation's top treasury official, in October 1989. |

# మఠాధిపతులు

— పానుగంటి లక్ష్మీనరసింహారావు

బొల్లియ్యసెట్టి యనారోగ్యస్థితిలో నున్నాఁ డనుట్టొందరచేఁ గ్రిందటిసారి సభ్యు లందఱు సభ చాలించి యాతనిఁ జూచుటకై పరుగెత్తిరి. విష్ణుమూర్తికి బొడ్డునఁ దామర, శ్రీమహాలక్ష్మికిఁ జేతిలోఁదామర. బ్రహ్మకుఁ బిఱ్ఱక్రిందఁ దామర. కాని సెట్టి కాపాదమస్తకము తామర! ఓ! ఒక్కటే తామర! ఏనుఁగుతామర! సర్వవ్యాపకత్వమున దీనికి బొమ్మజెముడే సాటి. శాశ్వతత్వమున నపకీర్తియే సాటి. అప్రతిహతమై, యనిర్వచనీయమై, యనాది మధ్యాంతమై, యైహికజీవన విరాగతోజ్జీవకమైన యీవస్తువు పరవస్తువును బోలియున్న దనికూడఁ జెప్పనొప్పునుగాని యత్యధికోపమముగ నుండు నని చెప్పవీలు లేదు. కండూతి నివారణార్థమై కల్పింపఁబడిన యొకయిత్తడిచేయివలనఁ గావలసినంతపని జరుగకుండుటచే దానికిఁ దోడుగ మరియొకటి నూతనముగ నిర్మింపఁబడెను. ఈరెండు నాతని చెరియొకహస్తము నాశ్రయించి యొఱదీసిన కత్తులవలె నొడలికోఁతలకై యొదుపునైచి యుండును. ఇంత లోకాతీతమైన తామరకుఁ గారణ మేమైయుండునో సెట్టి తెలిసికొనఁగోరి యెఱిఁగినవారి--నెఱుఁగనివారినిగూడ నడుగనారంభించెను. ఈనడుమను బదిసంవత్సరములనుండి నిరాఘాటముగాఁ దద్దినముల బ్రాహ్మణార్థభోజనము ననుభవించి పితృకర్మకర్తలకుఁ బితృదేవతలకు నడుమ సంధానకర్తయై చాకచక్యముతోఁ బ్రవర్తించి యిప్పుడు కొలఁది మాసములనుండి వ్యాధిగ్రస్తులకుఁ, బాశహస్తకింకరులకు నడుమ రాయబారపుఁ బనిని నిర్వర్తించుచుఁ దనమొదటివృత్తికి మఱింత వన్నెయు, వాసియుఁ దెచ్చుచున్న దేశీయభిషగ్వృషభులగు తిరుపతిశాస్త్రులగారి నిందునుగూర్చి సెట్టి యడుగ మొదట నాతనిది శ్లేష్మపైత్యతత్త్వ మనియు, శ్లేష్మము క్రమముగ ఘనీభవించి బరువైయుండ వాతముగఁ గ్రిందకుజారిన దనియుఁ, బైత్యము లఘువైన దగుటచే జఠరదీప్తిచే నంటుకొని సెగలు పొగలతోఁ గ్రమ్మి దేహమునంతయు వ్యాపించి నల్లగ మాడ్చనైచుటచే నొడలంత దద్రువులు, పుండ్లు బయలుదేరిన వనియు ''నుష్ణముష్ణేన శీతల'' మ్మను న్యాయముచే రసకర్పూరము నిత్యము సేవించిన యెడలఁ దామర నివారించు ననియు, నాతఁడు సచికిత్సానిర్దేశ రోగనిదానమొనర్చెను. పశువులగొంతులు గోయుట మాని యీ నడుమ నరమేధమును సంకల్పించి యాచరించుచున్న బుడేమియాసాహెబుగారిని సెట్టి యీవిషయమునుగూర్చి యడుగ ''నినుమునకు నీ రంటునెడలఁ ద్రుప్పుపట్టున ట్లీతనిశరీరమున నీ రుండుటచే నొడ లిట్లు త్రుప్పుపట్టుచున్నదనియు, లోనినీటిని హరించుటకై నిత్యమును నేపాళపుమాత్రలు సేవింపవలయు'' ననియు నతఁడు పిల్లిగడ్డ మల్లల్లాడుచుండ ''బిస్మిల్లా'' యనుచు నుపన్యసించెను. కర్మవిపాకజ్ఞఁడగు గరళకంఠశాస్త్రుల నతఁడిందుఁగూర్చి యడుగ నాతఁడు పూర్వ మొకచోరుఁ డనియు, నాతఁడొక వితంతువునింటికిఁ గన్నమునైచి యామె తనధన మెచ్చటనున్నదో చెప్పకపోవుట వలన నాతఁడు దూలగొండినూఁగు నామె యొడలికి రాచెననియు, దత్పాపనివారణార్థముగ నొక బ్రాహ్మణున కాతఁడు సదక్షిణాకముగఁ జందనచర్చలోఁ బీతాంబరము లొడలఁ గప్పవలయు ననియు, నాతఁడు చెప్పెను. ఒక జ్యోతిషికుని బిలిచి యాతఁ డడుగ జన్మపత్రమున నతనికిఁ గుజుఁడు నీచపడె ననియుఁ, నాతఁడే యిందులకుఁ గారణ మనియు

నొక పుట్టెఁడుకందులను రక్తవర్ణవస్త్రసహితముగ నొకబ్రాహ్మణునకు దానమిచ్చుటయేగాక సర్వగ్రహములకు యథారీతిని శాంతులు చేయించినమంచి దనియు నాతఁడు చెప్పెను. ఒకయెఱుకతను బిలిచి యాతఁడడుగ సీతనితోఁ బూర్వము కలిసి వ్యాపార మొనర్చిన యాతఁ డీతనికిఁ జేతఁబడి చేసె ననియుఁ, బంచవర్ణముల యన్నము పరమాన్నము నాతనికి దిగఁదుడిచి కారింగువతోఁ బొగనైచి యాయన్న మూరికుత్తరముగా గోధూళివేళ మూఁడుదారులు కలియుచోటఁ బాఱఁబోయవలయు ననియుఁ జెప్పెను. ఈసాధనపరంపరలో దేని నవలంబించుటకును దోఁచక బొర్రయ్యసెట్టి నాతో నివియన్నియుఁ జెప్పి యాలోచన మడిగెను. అంతట నే నట్టి సాధనపరంపరోపదేశకర్త లగువారిని దత్సాధన ప్రాశస్త్యములఁ గూర్చి యడిగితిని. తెనుఁగువైద్యుఁడు మహమ్మదీయ వైద్యునిఁ జెడఁదిట్టి "కర్పూరముకంటెఁ గలియుగసంజీవిని మరియొకటిలే"దని కంఠోక్తిగాఁ బలికెను. తనమందువలన "తందురుస్తీ" కలుగక పోయినయెడల "దాడి హజామత్" అని ఝూంకారముతోఁ బలికి "బమ్మన్ సైతాన్" అని మహమ్మదీయుఁడు పండ్లుగొఱికికొనెను. "గ్రహశాస్త్రమంతయుఁ గర్మవిపాకముకాలిక్రిందఁ దూరిపోవుటకైనఁ దగినదికాదని పూర్వోత్తర జన్మజ్ఞాన నిక్షేపుఁడు చెప్పఁగఁ గర్మవృషభమునకు గ్రహచారమే ముకుఁద్రాడని కార్తాంతికుఁడు గద్దరించెను. "ఎన్ని మందులైన, నెన్నికర్మచికిత్సలైన నెన్ని గ్రహశాంతులయిన నెఱ్ఱయన్నపు దిగఁదుడుపునకు, గబ్బిలపుఁబెంట ధూపమునకు సరియగునెడలఁ జెవిగోయించుకొందు" నని చెవిటియెఱుకత శ్రీసూక్తి సాయించెను.

ఇట్లెవరిమట్టునకు వారే యగ్రగణ్యులు! యథార్థవాదులు! మిగిలినవారు నీచులు. దొంగలు. కల్లుగీఁతలో నున్న గౌరవము కవిత్వపువ్రాఁతలో లేదని గవుండ్లవాని నమ్మకము. కన్నపుద్రేఁతలో నున్నఘనత, ధిషణాచాకచక్యము—తదనధాటిలో లేదని కన్నగాని నిశ్చయము. పండితు లెఱ్ఱసేలువును భుజమునఁ దాల్చి శాస్త్రజ్ఞానగర్వమున విఱ్ఱవీఁగఁగ రంగూనుకఱ్ఱపాదిని దాల్చి రాజుగా రిచ్చిన సింగపుఁదలాటపు మురుగులతో మంగలి లోకాతీతుఁడై వర్తిల్లును. ఉద్యోగి కలపుఁబోటులచే జీవనహాని చేసి యెంతక్రిందుమీఁదు తెలియకయుండునో పశుమారకుఁడు కత్తిఁద్రేటుచేఁ గలిగిన యానందముతో వానిపై నెగిరియాడును. ధాన్యాదుల నమ్ముకొని వర్తకుఁడు మోటారుబండ్లలో నెట్టులూగులాడునో తన సౌష్ఠవము నమ్ముకొని వారకాంత తూఁగుటుయ్యేలలో నంతకంటె నెక్కువగఁ గులుకుచుండును. కవియొకఁడు పలికినట్లు-

తే. ఎఱుకనికిఁ దనపంది భూమీశుపట్ట
గజమునకంటెఁ బ్రశస్తమై కానిపించు;
మిండనికిఁ దనకరి బోసి మెల్లసాని
యింద్రునూర్వశినెత్తిపై నెగిరిపోవు.

తనకంటె ఘనుఁడు లేఁడననియుఁ దాను లోకోత్తరుఁడనియు నెల్ల ప్రతిమనుజుని కుండును. తనస్వరూపము మంచిది. తనగుణము మంచిది. తననడువడి మంచిది. తనవృత్తి మంచిది యను నహంకారమూలకోన్మాదము సర్వజనసామాన్యమైయున్నది. ఇట్లు జనప్రకృతిని

గూర్చి యేమేమో మనమున నూహించుకొనుచుఁ బండుకొంటిని. అంతట నొకస్వప్నము గలిగెను.

బొల్లయ్యసెట్టి విశేషవ్యాధిగ్రస్తుఁడై యుండెను. మంచముపై నిద్దఱుజను లాతనిఁ బట్టుకొని కూర్చుండఁబెట్టిరి. అతఁడు మిగులబాధపడుచుఁ దల యొకప్రక్కకు వ్రాల్చి కూరుచుండెను. అతనిచేతిని దర్భముడియుంగర మున్నది. మంచమున కెదుటఁ గొందఱు బ్రాహ్మణులు కూరుచుండిరి. జీవప్రాయశ్చిత్తమంత్రములుకాఁబోలు చదువుచుండిరి. కొందఱు గ్రహశాంతులు చేయుటకై వరణలు తీసికొనుచుండిరి. ఇంతలో నొకబ్రాహ్మణుఁడు చేత గిండిఁ బూని ప్రవేశించి పంచగవ్య ప్రాశనమంత్రమును జదువుచు నాతని నోటి కుద్ధరిణితోఁ బవిత్రగోమూత్రోదకతీర్థము నిచ్చుచుండెను. అంత బ్రాహ్మణు లందఱు గొల్లుమనిరి. నేను స్వప్నముననే యదరిపడి బొల్లయ్యసెట్టి కాలధర్మము నొందె నని జడిసితిని గాని యట్లు కాలేదు. "శతం జీవ" యను నాశీర్వచనవుఁ బనసను బ్రాహ్మణు లంద రొక్క మొగిఁ గంఠములఁ గలిపి యుచ్చైస్స్వరమునఁ బఠించి మంత్రాక్షత లతనిపై వర్షించిరి. అంత ఫలప్రదానము ప్రారంభ మయ్యెను. "కర్కటక సోమయాజులుగారూ! మీరద్వైతపక్షమునఁ దాంబూలమును స్వీకరింపుఁ" డని యాబ్రాహ్మణసమాజములో సభాపతికాఁబోలు పలికినాఁడు. అంతటఁ గొంతసేపు సభ నిశ్శబ్దముగ నుండెను. అంత నొకబ్రాహ్మణుఁడు తీండ్రమున లేచి "కర్కటకశాస్త్రు లేపాటిఘనుఁడు? ఏమంత చదువుకొనినవాఁడు? ఏమంత శిష్టత గలవాఁడు? ఏపాటిసద్గుణసంపన్నుఁడు? ఏమంత వయోవృద్ధుఁడు? అద్వైత మతతాంబూలము నాతఁ డేల తీసికొనవలయును? అతఁ డపత్నీకుఁడై యింట నొక్కఁ డుండుటచేత నాతని కద్వైతసిద్ధి యైనదా?" యని యుత్కంఠమున హుంకరించెను. "నీవలె ముండ నుంచుకొని ద్వైతసిద్ధి నొందలేదులే!" యని యొక్కఁడు సభలో నాతనిఁ బరిహసించెను. "ఉంచుకొనలేదా? అతనియి ల్లూడ్చుదాసియైన బోసినాకాలి బట్టతలపై బాసికముగట్టిన బాపనపెండ్లికొడు కెవ్వరు?" అనునరికి "పరువునష్టమునకు దావా" యని కొందఱు కేకలువైచిరి. అంత సభాపతి లేచి "నాయిష్టమున కెవఁ డడ్డువచ్చునో చూతము. కర్కటశాస్త్రీ! చూచెద వేమి? తీసికో తాంబూల" మని బూకరించెను. అప్పుడు తెంగలి తిరువెంగడాచార్యులుగా రుపదేశముద్ర నున్న పాదము బ్రహ్మరంధ్ర స్థానమున కెగఁబ్రాఁకనచ్చి వీవన మొగమున కద్దుపెట్టుకొని "యద్వైతుని యాధిక్యమేమి? అతఁడు ముందుగాఁ దాంబూలము పుచ్చుకోనేల? రామానుజ మతస్థు లుండ, మాధ్వమతస్థు లుండ నగ్రతాంబూలమున కద్వైతి సిద్ధపడనేల? మతత్రయమున కిచ్చిన తాంబూలములు త్రిమతస్థులు సమముగా సమకాలమునఁ బుచ్చుకొనవలయునుగాని ముం దెవ్వఁడును దీసికోఁదగదు." అని చెప్పెను. ఆచార్యులుగా రాడినది న్యాయమని సభలోఁగొంద ఱామోదించిరి. "ఇచ్చట మాధ్వు లెవ్వరైన నున్నారా?" యని సభవా రొకని నొకని నడుగ నారంభించిరి. అంతట నొకమూలనుండి యొకఁడు జేనెఁ డంగవస్త్రమువాఁడు, వడితిరిగిన మీసాలవాఁడు, కొంచెము కుచ్చువిడిచిన నెత్తి గావంచవాఁడు, గోపీచందనపు డాగుల కణతలవాఁడు, ధూమచ్ఛదాగ్ని స్పర్శనమునఁగాబోలు నల్లవడిన పెదవులపైఁ గడచినరాత్రిదౌ తాంబూలరక్తిమ కాసంతగలవాఁడు, సకిలించుచు లేచి "నే నుంటి" నని ముందునకు వచ్చెను. ఈవ్యక్తి లక్షణరావుగారి వంటయింటిలోని భీమావతార

మని యెల్లరు గ్రహించిరి. ''వంటపూటేశుంఠకుఁ బరిషత్పూజాసహిత తాంబూల మేల?'' యని కొందఱు గొణిగిరి. అంత నామాధ్వుఁ డుత్కంఠమున ''సభవారు గుజగుజలు వోనక్కఱలేదు. ఉదరపోషణార్థమై న్యాయముగఁ జేసికొనువృత్తులలో గరిఁటెఁ బట్టుట లోపము కాదు. కలము పట్టుట ఘనత కాదు. కావడి మోయుటలోటును కాదు. కంఠాణమెక్కుట ఘనతయుఁగాదు. మీరిచ్చునది మతతాంబూలము కాని యదృష్టతాంబూలము కాదు. మీరు చేతిలో సిబ్బిగరిఁటెఁ జూతురా? ఫాలమునఁ గమలగంధము చూతురా? మూతిపై మీసాలఁ జూతురా? మదిలోని ముఖ్యప్రాణమూర్తిని జూతురా?'' యని పలికెను. బెండకాయబొట్టువాఁడు పెంకిముండవాడని కొందఱు గుసగుసలాడి కిసుకున నవ్వుకొనిరి.

అంతట నీముగ్గురును ఫలప్రదానపుఁ బళ్లెరమునొద్దకుఁ బోయి నిలువఁబడిరి. విసనకఱ్ఱ యడ్డుపెట్టుకొని కోరచూపుల నద్వైతివంకఁ జూచుచున్న వైష్ణవుఁడు. ''అదిగో పళ్లెరముపై ముందేల నీవు చేయివైచెదవు? అడ్డబొట్టుటసురత్వము పోనిచ్చుకొంటివి కా'' వని వీవనతో నొక్కపోటతనిచేతిపైఁ బొడిచెను. అంతట నద్వైతి పళ్లెముమీఁదఁ బెట్టుచున్న చెతి నామూఁడునామాలయాతనికిఁ గ్లిలముపై గట్టిగఁబెట్టెను. సభ గగ్గోలుపడుసందడిలో మాధ్వుఁడు తనతాంబూలమును దీసికొని మీసాల నవరించుకొనుచుఁ బోయెను. అంత సభవా రీమతశత్రుల నిద్దఱ సఖ్యపఱచి యిద్ద రొకసారి తాంబూలములఁ దీసికొనుఁడని యేర్పాటు చేసిరి. ఇద్దరొకసారి పళ్లెమునుండి తాంబూలములలాగికొనుటలో బలహీనతతోఁ గూరుచుండిన బొబ్రయ్యసెట్టి ముందునకుఁ బడెను. కాని కదుపు తలను గాపాడెను. మాధ్వుఁడు తాంబూలమును దీసికొనిపోయినజాడ నెవ్వఁడును గనిపెట్టనేలేదు. ఆతఁ డేఁడి యేఁ డని యెల్లరు చూచిరి. అయ్యయ్యో! మాధ్వుఁడు ముందుగాఁ దాంబూలము దీసికొని మతద్వయము నవమానించినాఁ డని యందఱుగ్రులయిరి. ఈమారునుండి మాధ్వతాంబూలమును మానిపింపవలసిన దని కొంద ఱుద్ఘాటించిరి. అంతలో ''ఇదిగో మాధ్వుఁ డిక్కడనే యున్నాఁడు. ఎక్కడకును బోలేదు'' యని యొక్కఁడనెను. అంతలో ''నీవుకూడ మాధ్వుఁడవే! ఆతఁడుకూడ మాధ్వుఁడే! ఇతఁడుకూడ మాధ్వుఁడే! అయ్యయో! అందఱు మాధ్వులే! నేనుగూడ మాధ్వుఁడనేకాఁబోలు!'' అని మఱియొకఁడు భయాశ్చర్య కంపితకంఠమునఁ బలికెను. అట్టి మెఱుపు మెఱసినంతలో బొజ్జయ్యసెట్టి కూరుచుండినమంచము పెద్దరాయి యయ్యెను. ఆ రాయి యట్టెయట్టె యెదిగి యేడుకొండ లయ్యెను. అదిగో శేషాచలము! అదిగో మోఁకాళ్లపర్వతము! అంతలో బొజ్జయ్యసెట్టి శంఖచక్రధారియగు శ్రీవేంకటేశ్వరనామక మహావిష్ణువిగ్రహ మయ్యెను! సెట్టి నిదివఱకుఁ బట్టుకొనియున్న వారు శ్రీభూనీళామహాదేవు లయిరి! ఇత్తడిచేతులు రెండు జయవిజయు లయ్యెను! ఓ! కలియుగ వైకుంఠము! శ్రీవేంకటరమణా! శ్రీనివాసా! యను మహానాదములతోఁ గొండ లెక్కు స్త్రీపురుషులు, సాధువులు, బైరాగులు, వేలు లక్షలు కానఁబడిరి. కొండక్రింద నీమాధ్వసమాజ మంతయుఁ జేరినది. ఎక్కడఁ జూచినఁ బంచముద్రలవారే! ద్వాదశోర్ధ్వపుంద్రధారులే! తులసీమాలావక్షస్కులే! శ్రీనివాస నామస్మరణ పరాయణులే! ఓ! నేల యీనినట్లున్నది! ఒకశాలలోఁ గుండలాలపండితులు చేరి శాస్త్రచర్చలు చేయుచుండిరి. మఱియొకచోట మధ్వాచార్యకృత గ్రంథములను సవ్యాఖ్యానముగఁ బఠించుచుండిరి. సుధాభాష్యకాలక్షేపమును మరియొకచోటఁ గొందఱు చేయుచుండిరి. మణిమంజరి మధ్వవిజయము మొద

లగు గ్రంథములను మరియొకచోటఁ జదువుచు బౌద్ధులను, ప్రచ్ఛన్నబౌద్ధులను బహుభం
గుల దూషించుచుండిరి. మరియొకచోఁ దంబురాలు చేఁబూనికాళ్లకు గజ్జెలు గీలించి
చిప్పతాళపుహంగుతోఁ బురందరనామములు కర్ణపేయముగఁ గొందఱు గానము చేయుచు
న్నారు. మరియుఁ గొన్నిచోటుల వ్యాసపీఠములపై భాగవత రామాయణముల నుంచి
పురాణకాలక్షేపము జేయుచున్నారు. ఈవేంకటేశ్వరక్షేత్రమునఁ జేరిన మాధ్వులలోఁ
బురుషులకంటె స్త్రీ లెక్కువగ నున్నారు. కొర్నాటి చీరలవారు, బనారసు కోకలవారు,
బరంపురపుఁ బీతాంబరముల వారు, సన్నకుసుంబాచీరలవారు, గోఁచికట్లవారు, గూడకట్ల
వారు, చుట్టుత్రిప్పులవారు, మేలిముసుఁగులవారు, వ్రేలుముళ్లవారు, జడచుట్ల వారు;
వంకకొప్పులవారు –అనేక వర్ణ స్వరూపవయో లావణ్య విలాసవైఖరీ సహితులగువా రెల్ల
నాయూరఁ జేతిపిల్లలతోఁ జంకపిల్లలతోఁ గడుపుపిల్లలతోఁ జేరిరి. పుష్పించిన నందనవన
మున్న ట్లీయలమేలు మంగాపురము పురంధ్రీమణి సహితమై యున్నది. కలలో నిది
తిరుపతిలోఁ గలిసిపోయినది. ఈస్త్రీలలోఁ బుణ్యస్త్రీలకంటెఁ బూర్వసువాసిను లధికముగ
నున్నారు. పురాణములఁ జదువుచోట్లనేమి, పురందరనామములు పాడుచోట్లనేమి, మతచ
ర్చలు జరుగుచోట్లనేమి, శాస్త్రవాదములు జరుగుచోటులనేమి, నూతనముగ గ్రంథములు
వ్రాసి కవులు వానిఁ జదువుచోటులనేమి, వడ్డనసాలలనేమి, నాటకశాలలోనేమి, చందనపుగి
న్నెలజాచిప్పలబజారులనేమి, యిక్కడక్కడ ననునియమము లేకుండ నీవెలివేఁపు వేపారివి
తంతువులు సర్వథా వ్యాపించియున్నారు. వీరు బారులుగట్టి కర్ణాటకభాషతో మాటాడు
కొనుచుఁ గొండల నెక్కుచుండఁగ నంతరిక్షమున నొకదిశనుండి మరియొకదిశకుఁ గొంగల
బారులు ''గీరుగారు'' మనుచుఁ బోవుచున్నట్లుండెనని యాయూరికవియే యొక పద్య
మును జదివినాఁడు. మహాభేరీనాదములును, ఢంకారవములును, ఘంటానినాదములు
నంతట వినవచ్చెను. శ్రీమదుత్తరాది మఠస్వాములవారు శ్రీమద్వ్యాసరాయ మఠస్వాముల
వారుకూడ నక్కడకు దయచేసిరి. వారు దేవతార్చాకలనాపరాయణతనుంటచే నీనాదములు
వెలువడిన ట్లూహించితిని. మఠముల వైభవములు, శ్రీరామచంద్ర పీఠములు శృంగారములు,
శ్రీస్వాములవారల పవిత్రస్వరూపము లవర్ణ్యములుగ నున్నవి. అప్పుడు మధ్యాహ్నము
రెండుమూఁడుగంటల నడిమిసమయము. భోజనమునకు శాలలోని కందఱుఁ బోవుచు
న్నారు. అవి తిరుపతిమాధ్వ సభాదినము అని నే ననుకొంటిని. విశాలశాలలలో లెక్కలేని
పఙ్క్తులు దీర్చి భోజనమున కెల్లరు కూరుచుండిరి. అంతలోఁ బెద్దకలకల మారంభమైనది.
ఎవ్వరును దానికిఁ గారణమును గ్రహింపలేదు. తుదకుఁ గొందఱు మాకు భోజనమక్కరలే
దని విస్తళ్ల యొద్దనుండి లేచిరి. వీరిని జూచి మఱికొందఱు లేచిపోయిరి. శ్రీమదుత్తరాది
మఠాధిపతులకును, వ్యాసరాయ మఠాధిపతులకును యుద్ధము జరుగుచున్నదని ప్రతీతి
వెల్లడియైనది. సర్వసంగపరిత్యాగశీలు రగుసన్న్యాసు లేమి? సమరమునకు సన్నద్ధులగు
టేమి? యని నాకాశ్చర్యము కలిగెను. మతవిషయకవాదములలో బద్ధదీక్షామత్సరులై
యున్నారేమోయని యనుకొనుటకు వారిద్దరేకమతస్థులే! వారిమఠములు భేదములుగాని
మతము వారి కొక్కటియే. అట్టిచో వారి కేల కలహము రావలయును? మర్యాదలలో నేమైన
వ్యత్యాసములు సిద్ధించెనేమో యని నే ననుకొని, యంతలో నదియుఁ గారణముకాదని నే
నూహించికొంటిని. వారిద్దరు జగత్పూజ్యులు. వారిద్దరిని గౌరవింపనివా రెవ్వరు? వారిని

గౌరవించుట యనునది వారిశిష్యులకు గౌరవము కాని వారికిఁ గాదు. అదిగాక "వారు నన్నుఁ జూడలేదు. వీరు కూరుచుండు మనలేదు. వారు నమస్కరింప లేదు" అని విచారించు మత్సరగ్రస్తులగు మందజనుల మూఢావస్థకు మిక్కిలి పైన నున్న ద్వంద్వశూన్యత్రామహసీ యన్మై మహోవస్థయందుఁ బట్టాభిషిక్తులగు పరమహంసశిఖామణులు వారైనప్పుడు మర్యాదలఁ గూర్చిన కలహ మేల కాఁగల దని నేను నిశ్చయపఱచుకొంటిని. ఇంతలో నెవ్వరో "మామూలక్కరలేదా? పూర్వాచారమక్కరలేదా? వ్యాసరాయపీఠ మూరు పేరు మాపీఠము ముందా?" యని కేకలు వైచుకొనుచుఁ బోవుచుండ నాతనిఁ బిలిచి "ఈతగవునకుఁ గారణమే" మని యడుగ నాతడు "అగ్రతీర్థము మా యుత్తరాదిస్వాములవారి కనూచానప ద్ధతి. ఆగౌరవము లిప్పుడు వ్యాసరాయస్వామి తనకుఁగావలయు నని కోరినారు. ఈప్రపంచ మంతయు నేలవలయు నని నాకుఁగూడ నున్నది. తాను తనపీఠము తన సంస్థానము తనయధికారముతాను జూచుకొని మాటలాడవలయునా? మాస్వాములవారు మర్యాదననుస రించి ప్రథమగౌరవము తనకే యుండవలయు నని శాసించినారు. అందులకు విరోధు లంగీకరింపలేదు. ఆదరణములకై వచ్చితిమా? అన్నమునకై వచ్చితిమా?" యని యాతఁడు మరలెను. ఇద్దఱకొక్క స్వల్ప విషయమునఁ గలిగినపట్టుచే నింద అభోజనముగ నుందు టయు, నిన్ని వేడుకలు భగ్నము లగుటయు, నిట్టి యైకమత్యము చెడిపోవుటయు, నిందఱనోళ్లఁ బడుటయు మంచిది కాదని నే నూహించు కొనుచుండఁగ ధామ్మనుధ్వని యయినది. నాకన్నులు చెదరి మూసికొనిపోయినవి.

తిరుగఁ గన్నులు తెఱచుసరికిఁ దిరుమలయు లేదు. అలివేలు మంగాపురము లేదు. మాధ్వసభ లేదు. మాధ్వస్వాములవారలు లేరు. పెద్దచెరువు గానఁబడినది. చెరువుప్రక్క నొక్కపట్టణ మున్నది. నౌబత్తులధ్వనులు పటహధమధమలు కాహళభాంకారములు మహ మ్మదీయ వేశ్యానాట్యధ్వనులు వినఁబడినవి. పెద్దమశీదు కనఁబడినది. అందున బారాహిమా మను పీరున్నది. దానియెదుట వివిధములగు వేషములాడుచున్నవి. మిక్కిలి ప్రసిద్ధిఁజెందిన యిద్దరు పులివేసగాం డ్రక్కడఁదారసించిరి. ఇద్దరుఁగూడ గొప్పదేహసాధనప్రవీణులు. కుడియెడమల మర్యాదలఁగూర్చి ఘోరమైన పోట్లాట జరుగుచుండెను. ఒకఁడు రెండవ వేసగానిఁ దనకుడివైపునఁ బోనిచ్చుటకు సమ్మతింపలేదు. కట్టులు విరుగుచున్నవి. కత్తు లాడుచున్నవి. తల లెగురుచున్నవి. రక్తము ప్రవహించుచున్నది. కేకలు మిన్ను ముట్టుచు న్నవి. కళేబరములు క్రిందఁబడుచున్నవి. కాని కుడియెడమలతగవు నద్దుకొనలేదు. నా కాయుల్లోల కల్లోలము చూడ మిగుల నాశ్చర్యము, భయము గలిగినవి. భయముచే ముడుచుకొని యొకమూలఁ గూర్చుంటిని. నాకు నెత్తికంతలో రెండుకొమ్ములు వచ్చినవి. చెవులు వ్రేలాడఁ జొచ్చినవి. నాల్గుగిట్టలకాళ్లేర్పడినవి. 'బే' యని యఱచుచు నటునిటు నేను మేకనై పరుగెత్తుచుండ నెవ్వఁడో చిల్లరపులి వేసగాఁడు నామెడను గఱచిపెట్టి పై కెత్తెను. నేను 'బే' యని గట్టిగ నఱచుచుఁ గన్నులు తెఱచుసరికి నాభార్య తన మొగమును నాభుజము, మెడ నడుమ నుంచి నిద్రఁబోవుచుండెను. అంత నాతో నామెయు లేవఁగ స్వప్న మంతయు నామెకుఁ జెప్పి దీని యభిప్రాయ మేమని యడిగితిని. మేక యనఁగా నజ మనియు, నజ మనఁగా బ్రహ్మ మనియు, నందఱు బ్రహ్మస్వరూపు లనియు, జీవులలో నొకనికంటె నొకఁడు హెచ్చనుకొనుట తప్పనియు నామె చెప్పెను.

Phone: 248532
Grams: CARDI CAP.
Telex: 0425-2043 NAAP IN

# AN ADVANCED TECHNOLOGY FOR AN IMPROVED QUALITY OF LIFE

NATCO

NATCO FINE PHARMACEUTICALS PVT. LTD.,
Natco Hose, Road-2, Banjara Hills, Hyderabad-500 034.

MISIMI/ మిసిమి RNI Regd No.45042/90 Telugu Monthly Hyderabad-500

Postal Regd. No.H/SD/191



**WELCOME 1991**

**Kala Jyothi Process Pvt. Ltd.**

MULTICOLOUR OFFSET PRINTERS

&

PHOTOTYPESETTERS

HYDERABAD-500 020.